





ఆ ఓట్లకు.. ఎర

- ఉద్యోగులకు ప్రలోభాలు..
- ఓటుకు రూ.3 వేలు రేటు
- వ్యతిరేకిస్తున్న ఉపాధ్యాయులు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఎన్నికల్లో ఆ ఓటుకు అత్యధిక ప్రాధాన్యం ఉంది. ఉద్యోగ వర్గాల ఓటర్ల తీర్పుపైనే ప్రభుత్వాలు ఏర్పడు తుంటాయి. ముందుగా పోస్టల్ బ్యాలట్‌లనే లెక్కిస్తారు. వీటి ట్రెండ్ ఆధారంగా ఏ ప్రభుత్వం ఏర్పడుతుందో అసలు ఓట్ల లెక్కింపు కంటే ముందుగానే అర్థమవుతుంది. ప్రతి ఎన్నికల్లో ఉద్యోగులు ఇచ్చే తీర్పు ఆధారంగా ప్రభుత్వాలు ఏర్పడటం చూశాం. ఈ సారి కూడా ఉద్యోగ వర్గాల ఓటుకు అత్యధిక ప్రాధాన్యం సంతరించుకుంది. ఉద్యోగులను ప్రలోభపెట్టేందుకు వైసీపీ అభ్యర్థులు తెరలేపారు.

ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులు 5, 6, 7 తేదీల్లో ఓటు హక్కును వినియోగించుకుంటారు. ఇప్పటికే పోస్టల్ బ్యాలెట్‌లను జారీ చేశారు. పల్నాడు జిల్లా నరసరావుపేట పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో 17,770 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేయనున్నారు. ఇందు కోసం ఎన్నికల యంత్రాగం ఏర్పాట్లు చేసింది. పోస్టల్ బ్యాలెట్ ఓటును కవర్‌లో పెట్టి పోస్టులో గతంలో పంపే వారు. పేరు పోస్టల్ బ్యాలెట్ అయినా ఈ విధానంలో ఎన్నికల కమిషన్ మార్పు తీసుకొచ్చింది. ఉద్యోగుల కోసం ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో పోలింగ్ స్టేషన్‌లను ఏర్పాటు చేసింది. నేరుగా వారి కేటాయించిన తేదీల్లో ఆయా కేంద్రాల్లో ఓట్లు వేయనున్నారు.

కొందరిని ఏజెంట్లుగా..

ఉద్యోగుల ఓట్లకు డబ్బుతో ఎరవేసేందుకు వైసీపీ అభ్యర్థులు రంగం సిద్ధం చేసుకున్నారు. ఉద్యోగుల్లోనే కొందరిని ఏజెంట్లుగా నియమించుకొని ఓట్ల కొనుగోలును చేపట్టారు. ఈ ప్రక్రియను విస్తృతంగా అమలు చేస్తున్నారు. ఓటుకు రూ.3 వేలు రేటు నిర్ణయించారు. భారీగా ఓట్లు కొనుగోలు చేసేందుకు ఏర్పాటు చేసుకున్నారు. ఆర్వో కార్యాలయాల నుంచి పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునే ఉద్యోగుల వివరాలను సేకరించారు. వారి చిరునామాల ఆధారంగా వారి ఇళ్లకు వెళ్లి బేరసారాలు చేస్తున్నారు. దీంతో తెలుగుదేశం అభ్యర్థులు కూడా అప్రమత్తమయ్యారు. కొన్నిచోట్ల ఉద్యోగుల ఓట్లు కొనుగోలు చేసేందుకు టీడీపీ కూడా కసరత్తు చేస్తోంది.


ఉపాధ్యాయుల నుంచి తీవ్ర వ్యతిరేకత

ప్రభుత్వం అనుసరించిన విధానాలతో ఇక్కట్లు పడ్డ ఉద్యోగులు వైసీపీ పట్ల కొంత ఆగ్రహంగా ఉన్నారు. ప్రధానంగా ఉపాధ్యాయ వర్గం నుంచి వైసీపీ అభ్యర్థులు తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొంటున్నారు. కొందరు ఉపాధ్యాయ సంఘాల నేతల ద్వారా ఉపాధ్యాయుల ఓట్లు కొనుగోలు చేసేందుకు చేస్తున్న ప్రయత్నాలు బెడిసి కొడుతున్నట్టు తెలిసింది. తమ ఓటును వైసీపీకి అమ్ముకోబోమని కొందరు ఉపాధ్యాయులు ముఖం మీదనే చెబుతున్నారు. ఉపాధ్యాయ వర్గం నుంచి వ్యతి రేకత వ్యక్తమవుతుండటంతో మిగతా ఉద్యోగుల మద్దతు పొందేందుకు వైసీపీ అభ్యర్థులు గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. ఒక్కో నియోజకవర్గంలో రెండు నుంచి మూడు వేల పోస్టల్ బ్యాలెట్లు ఉన్నాయి. గత ఎన్నికల్లో ఉద్యోగులు వైసీపీ అభ్యర్థులకు అనుకూలంగా ఓటు వేసిన విషయం తెలిసిందే. ఆ పరిస్థితులు తారు మారు అవుతుండటంతో సదరు అభ్యర్థులు నష్టపోనున్నారని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఉద్యోగులు కూటమి అభ్యర్థులకు మద్దతు ఇచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్న అభిప్రాయాన్ని వారు వ్యక్తం చేస్తున్నారు. మొత్తం మీద ఉపా ధ్యాయ వర్గం నుంచి వస్తున్న వ్యతిరేకతతో వైసీపీ అభ్య ర్థులు కంగుతింటున్నారు. అవసర మైతే ఓటు రేటు పెంచి ఉద్యోగుల పోస్టల్ ఓట్లు పొందేందుకు సదరు అభ్యర్థులు సర్వశక్తులు ఒడ్డుతున్నారు. ఉద్యోగులు వేసే ఓటుపై అభ్యర్థుల భవిష్యత్ ఆధారపడి ఉందని చెప్పవచ్చు.



కొత్తదారుల్లో కోట్లు!

- చెక్‌పోస్టులు దాటకుండానే సిద్ధం
- చాలా వరకు ముందే మేల్కొని సర్దేశారు
- అధికార పార్టీకి ఇసుక డబ్బు కల్పతరువే
- వైసీపీ అభ్యర్థులకు సూక్ష్మ రుణ సంస్థల సహకారం




ఎన్నికలంటే ప్రచారం.. పోలింగ్‌కే పరిమితం కావడంలేదు. ఓట్ల పండుగ.. రూ.కోట్లు ఖర్చయ్యే కార్యక్రమంగా మారింది. డబ్బు కట్టలు తెగాల్సి వస్తోంది. ఎన్నికల సంఘం డబ్బు తరలింపును కట్టడి చేసేందుకు చేస్తోన్న యత్నాలు రాజకీయ నాయకుల జిమ్మిక్కులతో ఎక్కడికక్కడ విఫలమవుతున్నాయి. ప్రచార ఖర్చులు ఒకెత్తు అయితే పోలింగ్‌కు ముందు ఓటర్లకు డబ్బు పంపిణీ ఓ పెద్ద ప్రహసనం. ఈ క్రమంలో గతానుభవాలను దృష్టిలో ఉంచుకున్న అభ్యర్థులు రూ.కోట్లు తరలించేందుకు, సమీకరించేందుకు కొత్తదారులతో సిద్ధమయ్యారు. అధికార పార్టీ అభ్యర్థులు ఇప్పటికే డబ్బు విషయంలో సిద్ధమయ్యారని సమాచారం. డబ్బుకు లోటులేకుండా సమ కూర్చుకుని జాగ్రత్త పడ్డారని తెలుస్తోంది. వైసీపీ అభ్యర్థులకు ఇసుక డబ్బు కల్పతరువుగా మారింది. పైగా ఎక్కడికక్కడ గ్రామాల్లో పాతుకుపోయిన సూక్ష్మ రుణ సంస్థల సహకారం కూడా వారికి ఉంది. ఎన్నికల కోడ్ వచ్చినప్పటి నుంచి ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఎక్కడా కూడా పెద్ద మొత్తంలో నగదు పట్టుబడలేదంటే అభ్యర్థులు ఏ స్థాయిలో జాగ్రత్తగా ఉన్నారో తెలుస్తోంది.

తెనాలి, మే 3 (ఆంధ్రజ్యోతి): గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లోని అసెంబ్లీ, లోక్‌సభ స్థానాల్లో పోటీలో నిలిచిన అభ్యర్థులు ఎన్నికల ఖర్చుకోసం అవసరమైన డబ్బు సమకూర్చుకోవడానికి కొత్తదారులు వెతుకుతున్నారు. అధికార వైసీపీ తరఫున సిట్టింగ్ ఎమ్మెల్యేలే పోటీలో ఉండగా వారు వెతుక్కోవాల్సిన పనిలేకుండా ముందుగానే అంతా సిద్ధం చేసుకున్నారనేది సమాచారం. ఎన్నికలకు అవసరమైన డబ్బు సంపాదించుకునే అవకాశం కల్పిస్తే, ఒక ఎన్నిక కోసం కాకుండా ఏకంగా పది ఎన్నికలకు సరిపడా డబ్బు వెనకేశారనేది పలుమార్లు ప్రతిపక్ష పార్టీలు చేస్తూ వచ్చిన ఆరోపణే. ఈ రోజుల్లో ఎన్నికలంటే డబ్బు. అభ్యర్థుల ప్రచారానికి జన సమీకరణ నుంచి, ఓటు కోసం ఎర వేసేవరకు అంతా డబ్బుతోనే ముడిపడిఉంది. పోలింగ్ నాటికి డబ్బు కట్టలు తెంచుకోవడానికి సిద్ధమవుతోంది. ఒక్కో అసెంబ్లీ అభ్యర్థి రూ.30 కోట్ల నుంచి, రూ.50 కోట్ల వరకు ఖర్చు చెయ్యాలనే లక్ష్యంతో ఉన్నారనేది బహిరంగ రహస్యమే. అటు ఎంపీ అభ్యర్థులూ వారి ఖర్చులు కాక, తన నియోజకవర్గ పరిధిలో ఉన్న అసెంబ్లీ అభ్యర్థులకూ రూ.10 నుంచి రూ.20 కోట్ల వరకు డబ్బు సర్దుబాటు చెయ్యాల్సి రావడంతో ఒక్కో అభ్యర్థికి రూ.50 నుంచి రూ.80 కోట్ల వరకు ఖర్చు తప్పని పరిస్థితి. కొందరికైతే రూ.100 కోట్లు దాటిపోతున్న పరిస్థితుల్లో ఖర్చంటే లెక్కచేయని వాతావరణం నెలకొంది. ఈ పరిస్థితుల్లో ముందస్తుగా అధికార పార్టీ అభ్యర్థులు డబ్బు సమకూర్చుకోలేని పరిస్థితుల్లో సూక్ష్మ రుణ సంస్థల నుంచి డబ్బు సమకూర్చుకుంటున్నారని సమాచారం. ప్రతి గ్రామంలోనూ ఈ సంస్థలు వేళ్లూనుకుపోయాయి. వారాలు, రోజువారీ వసూళ్ల వంటి సంస్థలు జనానికి సుపరిచితమే. అయితే వీరి దగ్గర భారీ మొత్తంలో ఎప్పుడూ డబ్బు నిల్వ ఉంటుంది కనుక ఈ నెల రోజులు ఎన్నికలకు అడ్డం వేసేందుకు ఇప్పటికే అంగీకరించారని తెలిసింది. ఇక గ్రామాల్లో ఎవరైనా అప్పు కావాలన్నా పెద్ద మొత్తాలు అప్పుగా ఇవ్వకుండా, చాలావరకు లేవని చెప్పేస్తున్నారు. ఎందుకని ఆరాతీస్తే డబ్బు ఫలానా అభ్యర్థికి సర్దాల్సి వచ్చినందువల్ల ఇవ్వలేకపోతున్నామని బహిరంగంగానే చెబుతున్నారని సమాచారం. ఇవికాక అధికార పార్టీకి చెందిన కొన్ని సంస్థలు, కంపెనీలు, పెద్ద కాంట్రాక్టర్ల నుంచి కూడా డబ్బు అందుతోందని సమాచారం.

ముందుగా మేల్కొన్న అభ్యర్థులు

గత ఎన్నికలతో పోల్చుకుంటే ఈ ఎన్నికల సందర్భంగా ఏ చెక్‌పోస్టులోనూ ఒక రాజకీయ నాయకుడివనో, ఫలానా అభ్యర్థికి సంబంధించిన డబ్బని భారీ మొత్తంలో నగదు దొరికిన సందర్భాలు తక్కువే. దీని నిబట్టి చూస్తే ఆయా రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ముందుగానే మేల్కొన్నారనేది అర్థమవుతోంది. దీనికితోడు ప్రధాన పార్టీల అభ్యర్థులు ఎవరనేది ముందుగానే ఒక నిర్ధారణకు వచ్చారు. అధికార వైసీపీ అయితే ఎన్నికల కోడ్ రాకముందే తమ అభ్యర్థులను నియోజకవర్గ ఇన్‌చార్జిలుగా నియమిస్తూ, వారు ఎమ్మెల్యేగా గెలిస్తే లభించే అధికార లాంఛనాలన్నిటినీ కల్పించేసింది. ఇటు ప్రతిపక్షంలో ఉన్న కూటమి అభ్యర్థులు ఎవరనేది కూడా ఈసారి ముందుగానే తేలిపోవడంతో ఎవరికివారు డబ్బు సమకూర్చుకునే విషయంలో జాగ్రత్త పడ్డారు. అయితే కొన్ని స్థానాల్లో మాత్రమే చివరి నిమిషంలో మార్పులు జరిగినా, వాటిలోనూ డబ్బు ఇబ్బందులు లేకుండా జాగ్రత్తపడ్డట్టున్నారు. చెక్‌పోస్టుల వద్ద తనిఖీల్లో పట్టుబడిన నగదు కేవలం రూ.50 వేల నుంచి రూ.లక్ష, రెండు లక్షల వరకు ఉండటం దీనికి నిదర్శనం. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో భారీ మొత్తాలు దొరికింది అంతంతమాత్రమే. గత ఎన్నికల సమయంలో వైసీపీ అభ్యర్థులకు ఏ ఆటంకం లేకుండా డబ్బు అందుబాటు కావడం, అనేక మార్గాల్లో తేలికగా చేరవేశారనే విమర్శలు వచ్చాయి. ఈసారి అధికార వైసీపీనే కాకుండా, ప్రతిపక్ష కూటమి అభ్యర్థులు కూడా గత అనుభవాలతో ముందుగానే జాగ్రత్తపడ్డట్లున్నారు. పోలింగ్‌కు కేవలం తొమ్మిది రోజులే గడువు ఉంటే, చివరి ఐదు రోజుల్లో ఓటుకు డబ్బు పంపిణీ ఊపందుకునే అవకాశం ఉంది. అయితే ఎవరూ హడావిడి పడటం, తొందరపడి దూర ప్రాంతాల నుంచి డబ్బు తరలిస్తున్న పరిస్థితులు కనిపించడంలేదు.



ఇసుక మాటున కట్టలు

గతంలో పార్సిల్ లారీలు, అంబులెన్స్‌లను డబ్బు తరలింపునకు ఉపయోగించారు. ఇప్పుడు అధికార పార్టీ నేతలు ఇసుక లారీలను వాడుకుంటున్నారని తెలిసింది. ఈ లారీలకు బిల్లు ఉన్నా, లేకున్నా ఎక్కడా పోలీసులు ఆపకపోవటం, తనిఖీ కూడా నామమాత్రంగా చేస్తుండటంతో వారికి అడ్డులేకుండా పోతోంది. వీటిలో డబ్బు తరలిపోతున్నా పట్టించుకోవడంలేదని ఇటీవల జనసేన నేతల ఆరోపించారు. అయినా పోలీసులు అంతంతమాత్రంగానే చూసి వదిలేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఇసుక తవ్వకాల ద్వారా వచ్చిన మొత్తాలను కూడా ఏరోజుకారోజు కొన్ని చోట్ల నేతలు ఆదేశించిన వారికి అందిస్తున్నారని చెబుతున్నారు. ఒక్కో రీచ్‌లో ఒక్క రోజులో జరుగుతున్న వ్యాపారమే అధికారికంగా రూ.20 లక్షలు అనధికారికంగా రూ.కోటిపైనే ఉంటుం డటంతో ఈ డబ్బా అభ్యర్థులకు ఇప్పుడు కల్పతరువుగా ఉపయోగపడుతోంది.

చెక్‌పోస్టు.. లేదు

జిల్లా, నియోజకవర్గ సరిహద్దులో పెద్దఎత్తున చెక్‌పోస్టులు ఏర్పాటు చేశాం. నగదు, మద్యం, ఇతర తాయిలాలు తరలిపోకుండా పక్కాగా తనిఖీలు చేస్తున్నాం.. అని అటు ఎన్నికల అధికారులు, ఇటు పోలీసులు రోజూ ప్రకటిస్తున్నారు. సంచార బృందాలను కూడా సిద్ధం చేశామని అనుమానిత ప్రాంతాల్లో తనిఖీలు చేస్తున్నామని అధికారులు చెప్తున్నారు. అయితే చాలా ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేయలేదు. ఏర్పాటు చేసిన దగ్గర కూడా అంతంతమాత్రంగానే తనిఖీలు చేస్తున్నారని, పెద్దగా డబ్బులు పట్టుపడకపోవడమే ఇందుకు కారణమన్న ఆరోపణలున్నాయి. గతంలో ప్రతి ఎన్నికల సమయంలో తెనాలి-చిలుమూరు రోడ్డులో తెనాలి బయట తప్పనిసరిగా ఒక చెక్‌పోస్ట్ ఉండేది. కానీ ఈ మార్గంలో ఈ సారి ఒక్క చెక్ పోస్టు పెట్టలేదు. పోలీసులకు బుద్ధిపుట్టినప్పుడు సంచార బృందాలతో మాటువేస్తున్నారే కానీ, కచ్చితమైన తనిఖీలు లేవు. అటు కృష్ణా కుడి కరకట్టపైనా, నది దాటే గాలు మార్గాలు, అంతర్గత రోడ్లపై నిఘానే లేదు. పొరపాటున ఎవరైనా ఫలానా వాహనంలో డబ్బు రవాణా అవుతుందని సమాచారం ఇస్తే తప్ప పోలీసులకు దొరుకుతున్న పరిస్థితిలేదు. దీనిని బట్టి చూస్తే అధికార పార్టీ నేతల హవా నిఘాపైనా ఎంతవరకు పని చేస్తుందనేది అర్థమవుతుంది. వీటన్నిటీ చూస్తుంటే ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న ఆరోపణల్లో నిజం ఉందనే అనుమానాలు కలగక మానవు.



తెనాలి వద్ద తనిఖీలులో చేస్తున్న పోలీసులు (పాత చిత్రం)

గడప గడపకు.. గొట్టిపాటి కుటుంబం

- భార్యాబిడ్డలు తోడుగా ఇంటింటా ప్రచారం
- మేనిఫెస్టో వివరిస్తూ.. భవిష్యత్‌పై భరోసా ఇస్తూ
- అన్ని వర్గాలతో అద్దంకి అభ్యర్థి రవికుమార్ మమేకం



ప్రచారంలో భాగంగా దుకాణంలో టీ తాగుతూ గొట్టిపాటి రవికుమార్



టీడీపీ మేనిఫెస్టో గురించి వృద్ధుడికి వివరిస్తున్న గొట్టిపాటి సతీమణి ఝాన్సీ



ప్రచారంలో రవికుమార్ కుమారుడు హర్షవర్ధన్

బాపట్ల, మే 3 (ఆంధ్రజ్యోతి): అద్దంకి నియోజకవర్గంలో నాలుగు పర్యాయాలుగా విజయం సాధించి ఐదో సారి గొట్టిపాటి రవికుమార్ ఐదో సారి బరిలో నిలిచారు. ఐదో సారి కూడా అసెంబ్లీ గడప తొక్కాలని ప్రచార పర్వంలో మునిగితేలుతున్నారు. టీడీపీ జెండా ఎగురవేసేందుకు ఆయనకు తోడుగా కుటుంబం మొత్తం కదిలింది. గడప గడపను తడుతూ టీడీపీకి ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు. రవికుమార్ ప్రచారంలో సతీమణి ఝాన్సీతో పాటు కుమారుడు హర్షవర్ధన్, సోదరుడి కుమారుడు బాబి తదితరులు చేదోడు వాదోడుగా ఉంటున్నారు. నలుగురు నాలుగు వైపులా తిరుగుతూ ఇప్పటికే నియోజకవర్గంలోని ప్రతి గడప సందర్శించిన రికార్డు నెలకొల్పారు. ప్రచారంలో భాగంగా అన్ని వర్గాలను కలుపుకుపోతున్నారు. నియోజకవర్గంలో హ్యాట్రిక్ విజయం నమోదు చేసిన రవికుమార్‌ను దాదాపు ప్రతి కుటుంబం తమ సొంతమనిషిగా అక్కున చేర్చుకుంటుంది.

వ్యక్తిగతంగా ప్రతి ఓటరును కలవడమే లక్ష్యం

ఐదేళ్ల వైసీపీ పాలనలో ఇబ్బందులు పడని వర్గమే లేదంటే అతిశయోక్తికాదు. దీంతో వ్యక్తిగతంగా ప్రతి ఓటరును కలిసి వారికి తామున్నామనే ధైర్యం కల్పించాలనే లక్ష్యంతోనే ప్రచారంలో ప్రణాళికలను రవికుమార్ రచించారు. ఈ ప్రచార యజ్ఞంలో రవికుమార్‌కు సతీమణితో పాటు కొడుకు, సోదరుడి కుమారుడు అండగా నిలవడం విశేషం

పార్టీలకతీతంగా పిలిస్తే పలుకుతాడనే పేరు..

నియోజకవర్గంలో పార్టీలకతీతంగా ఏ సమస్య ఉన్నా పిలిస్తే పలుకుతాడనే పేరు అద్దంకి ఎమ్మెల్యే రవికుమార్‌కు ఉంది. అందుకు తగ్గట్టుగానే పేదల పక్షపాతిగా ఉంటూ రాజకీయ సమరంలో ఓటమెరుగని నేతగా కీర్తి గడించారు. ఆడంబరాలకు పోకుండా సామాన్య ప్రజలతో రవికుమార్ మమేకమయ్యే తీరే ఆయన వరుస విజయాలకు కారణంగా ఉంది. ఆయన వారసత్వాన్ని పుణికిపుచ్చుకుని అన్ని వర్గాల అభిమానాన్ని కుటుంబ సభ్యులు చూరగొంటున్నారు. మరోమారు భారీ మెజార్టీతో విజయం సాధించే దిశగా గొట్టిపాటి అడుగులేస్తున్నారు.



వృద్ధురాలికి పథకాలు వివరిస్తున్న గొట్టిపాటి సోదరుడి కుమారుడు బాబి

సెట్ చేశాం.. ఇబ్బంది లేదు

- ప్లాట్ల కొనుగోలుదారులకు రియల్టర్ల అభయం
- కాల్వ పూడ్చిన ఘటనపై చర్యలకు అధికారుల వెనుకడుగు

చీరాల, మే 3: వెంచర్లలోకి దారి కోసం కొత్తపేట, రామాపురం మధ్య పంట కాల్వను కొందరు రియల్టర్లు పూడ్చేశారు. సాగునీటి పారుదలకు ఆటంకం కలిగించేలా పంటకాల్వను పూడ్చడంపై సంబంధిత అధికారుల మౌనంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం ఆంధ్రజ్యోతిలో 'పంట కాల్వను పూడ్చేశారు' పేరుతో ప్రచురితమైన కథనంపై వెంచర్లలో ప్లాట్ల కొనుగోలుదారులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో ఏం ఇబ్బంది లేదు.. అంతా సెట్ చేసేశాం.. అందర్నీ సంతృప్తి పరుస్తున్నాం.. ఇబ్బంది లేదు. పోటీలో ఉన్న ముఖ్యులకు పార్టీ ఫండ్ ఇస్తున్నాం.. అని రియల్టర్లు అభయం ఇస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. కాల్వను పూడ్చి తమ వెంచర్లో అంతర్భాగంగా మార్చుకుంటున్నారని, ఇది కొనసాగితే భవిష్యత్‌లో మరమ్మతులకు అవకాశం ఉండదదని రైతులు ఆందోళన చెందుతున్నారు. పంటకాలువకు సంబంధించి ఐడీసీ (ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించటంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అది తమ పరిధిలోనిదో కాదో పరిశీలించి చర్యలు చేపడతామన్న అధికారులు ఆ తర్వాత రైతు కమిటీ బాధ్యులని చెప్తున్నారు. బాధ్యత ఎవరిదైనా పంటకాల్వ పూడ్చటమనేది చట్టవిరుద్ధం. ఈ క్రమంలో అందుకు పాల్పడుతున్నవారిపై ముందస్తుగా ఫిర్యాదు చేసి తదుపరి చర్యలు చేపట్టాలి. ఐడీసీ ఎండీ కేసు పెట్టొద్దని చెప్పారని ఐడీసీలోని ఓ కీలక అధికారి వ్యాఖ్యానించినట్లు తెలుస్తోంది.

5న నీట్ పరీక్ష

● గుంటూరు నగరంలో ఏడు, పొన్నూరులో ఒక కేంద్రం

గుంటూరు(విద్య), మే3: వైద్య కళాశాలల్లో ప్రవేశం కోసం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ జాతీయ స్థాయిలో జరిగే నేషనల్ ఎలిజిబులిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్(నీట్) ఈనెల 5న జిల్లాలో నిర్వహించనున్నారు. ఇందుకోసం గుంటూరు నగరంలో ఏడు కేంద్రాలు, పొన్నూరులో ఒక కేంద్రం ఏర్పాటు చేశారు. పరీక్ష మధ్యాహ్నం 2.00 నుంచి సాయంత్రం 5.20 వరకు నిర్వహిస్తారు. విద్యార్థులను కేంద్రాల్లో మధ్యాహ్నం 1.30 వరకే విద్యార్థులకు అనుమతిస్తారు పరీక్షకు ఉమ్మడి జిల్లా నుంచి 4,089 మంది విద్యార్థులు హాజరుకానున్నారని ఎన్‌టీఏ ప్రతినిధులు వెల్లడించారు. గుంటూరు నగరంలోని జేకేసీ కళాశాల, చౌడవరంలోని ఆర్వీఆర్ అండ్ జేసీ ఇంజినీరింగ్ కళాశాల, జేకేసీ కళాశాల రోడ్డులోని కేఎల్‌పీస్కూల్, మోతడకలోని చలపతి ఇంజినీరింగ్ కళాశాల, విద్యానగర్‌లోని లిటిల్ ఫ్లవర్ స్కూల్, బ్రాడీపేటలోని బీహెచ్ డిగ్రీ కళాశాల, శ్యామలానగర్‌లోని శ్రీవేంకటేశ్వర బాలకుటీర్, పొన్నూరులోని నాట్కో స్కూల్‌లో పరీక్షా కేంద్రాలను ఎన్‌టీఏ ఏర్పాటు చేసింది.

జంపని పొలిమేరలో

గొడుగు పాలుని శాసనస్తంభం

● జంపని గ్రామ చరిత్రగా గుర్తింపు



సదాశివరాయల నాటి వలయ వామన స్తంభ శాసనం, జంపని గొడుగు పాలుని శాసనం

వేమూరు, మే 3: గత ఆరేళ్ళ నాడు బాపట్ల జిల్లా వేమూరు మండలం జంపని గ్రామ శివారులో డొంక రోడ్డు నిర్మాణం జరుగుతున్న సందర్భంలో తవ్వకాల్లో బయటపడ్డ శాసనపు స్తంభాలను ఆంధ్రజ్యోతి గుర్తించింది. సమాచారాన్ని వార్త రూపంలో ప్రకటించడంతో పాటు శాసన చరిత్రలను అన్వేషించే వ్యక్తులకు తెలిపింది. శాసన స్తంభాలను సమీపంలో ఆంజనేయస్వామి మందిరం వద్ద నిలబెట్టించింది. ఇటీవల ఈ ప్రాంత పర్యటనకు విచ్చేసిన శాసన చరిత్ర అన్వేషకుడు నల్లగొర్ల వేదాద్రి, వాటి ఫోటోలను ప్రముఖ చరిత్రకారుడు స్థపతి ఈమని శివనాగిరెడ్డికి పంపారు. శివనాగిరెడ్డి శాసనపఠాన్ని చారిత్రక విషయాలను క్షుణ్ణంగా పరిశీలించి శుక్రవారం అందులోని చారిత్రక విషయాలను ప్రకటించారు. ఈ శాసన స్తంభంలో జంపని గొడుగుపాలుని శాసనంగా రాసి ఉందని, అందులో జంపని గ్రామ చరిత్ర ఉన్నట్లుగా పేర్కొన్నారు. శాసన వివరాలను సేకరించడంలో కృషి చేసిన చౌడం పురుషోత్తం, మణిమేల శివశంకర్, రామోజు హరగోపాల్‌లకు ఈ సందర్భంగా పలువురు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నారు.

నేడు రేపల్లెకు పవన్‌కల్యాణ్..

రేపల్లె / పొన్నూరు టౌన్, మే 3: రేపల్లెలోని ఎన్టీఆర్ సర్కిల్‌లో శనివారం జనసేన అధ్యక్షులు కొణిదల పవన్ కల్యాణ్ వారాహి విజయభేరి సభ నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఉప్పూడిరోడ్డులోని హెలిప్యాడ్ వద్ద దిగి ర్యాలీగా ఎన్టీఆర్ సర్కిల్ వద్దకు చేరకుని సభలో ప్రసంగించనున్నారని తెలిపారు.

5న పొన్నూరుకు.. ఈ నెల 5న పొన్నూరులో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పర్యటనను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం సజ్జా ఫంక్షన్ హాల్ వద్ద హెలిప్యాడ్‌ను, పట్టణ ప్రధాన కూడలిలో ఎన్టీ రంగా విగ్రహం వద్ద నిర్వహించే సభా ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు.



● భానుడు.. భగభగ
● 4 డిగ్రీలు పెరిగిన ఉష్ణోగ్రత

● నరసరావుపేటలో అత్యధికంగా 46 డిగ్రీలు
● గుంటూరులో 44 డిగ్రీలను తాకిన ఉష్ణోగ్రత
● రాబోయే 48 గంటల్లో వడగాడ్పులు వీచే అవకాశం

భానుడు భగభగలాడాడు. మే నెల ఆరంభంలోనే విశ్వరూపం ప్రదర్శించడంతో ప్రజలు శారెత్తి పోతున్నారు. ఉమ్మడి గుంటూరుజిల్లా పరిధిలోని గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వారం క్రితంవరకు 40 డిగ్రీల సెల్సియస్ మధ్యనే నమోదు అవుతూ వస్తోన్న ఉష్ణోగ్రత ఒక్కసారిగా 44 డిగ్రీలకు చేరింది. గుంటూరు జిల్లాలోనూ ఉష్ణోగ్రత గణనీయంగా పెరిగింది. పల్నాడు జిల్లాలో పలు మండలాల్లో 44 నుంచి 45 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఆటోమేటిక్ వెదర్ స్టేషన్ డేటాలో అత్యధికంగా నరసరావుపేటలో 46 డిగ్రీల సెల్సియస్ నమోదైనట్లు వాతావరణ శాఖ బులెటిన్ విడుదల చేసింది.

గుంటూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఏప్రిల్ నుంచే ఎండలు ముదిరాయి. మేనెల వస్తూనే ఉచ్ఛస్థితికి చేరువ య్యాయి. మరికొద్ది రోజుల్లో రోహిణీ కార్తె ప్రారంభం కానుండగా ఇప్పుడే ఎండలు ఈస్థాయిలో మండుతుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. శుక్రవారం ఉదయం 8 గంటల నుంచే వాతావరణం వేడెక్కడం ప్రారంభించి గంటగంటకు నిప్పుల కొలిమిలా మారిపోయింది. ఇక మధ్యహ్నం 12 గంటల నుంచి 3.30 గంటల మధ్యన ఇంట్లో నుంచి కాలు బయటకు పెట్టలేని పరిస్థితి తలెత్తింది. గరిష్ఠ ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటిపోగా కనిష్ఠ ఉష్ణోగ్రత 30డిగ్రీల స్థాయిలో నమోదైంది. ఎయిర్‌కండీషనర్లు కూడా గదిలో ఉష్ణోగ్రతని పెద్దగా తగ్గించలేకపోతున్నాయంటే ఎండ తీవ్రత ఏస్థాయిలో ఉందో అంచనా వేయొచ్చు. మండే ఎండలకు మూగజీవాలు విలవిలలాడిపోయాయి. ఎండతాపం నుంచి శరీరాన్ని కాపాడుకునేందుకు ప్రతీ ఒక్కరూ తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

శుక్రవారం నమోదైన ఉష్ణోగ్రత (డిగ్రీలలో)	
నరసరావుపేట	46
నూజెండ్ల	45.7
వెల్దుర్తి, మాచర్ల	45.2
రొంపిచర్ల	44.7
నకరికల్లు	44.3
గుంటూరు	44
అద్దంకి	40
సంతమాగులూరు	40
యద్దనపూడి	40

వాతావరణశాఖ హెచ్చరికలు..

ప్రభుత్వం విడుదల చేసిన రాబోయే 48 గంటల వాతావరణ అంచన మేరకు అమరావతి, పెదకూరపాడుతోపాటు పల్నాడులోని పలుమండలాల్లో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది. మంగళగిరి, మేడికొండూరు, ఫిరంగిపురం, ఫిరంగిపురం, ప్రత్తిపాడు, తాడేపల్లి, తాడికొండ, తెనాలి, తుళ్లూరులో ఎండ తీవ్రత పెరిగే అవకాశముందని వాతావరణశాఖ హెచ్చరించింది. అద్దంకి, అమర్తలూరు, బల్లికురవ, భట్టిప్రోలు, చెరుకుపల్లి, ఇంకొల్లు, కారంచేడు, కొల్లూరు, కొరిశపాడు, మార్టూరు, పర్చూరు, సంతమాగులూరు, చుండూరు, వేమూరు, యద్దనపూడిలో 44 డిగ్రీలకు చేరుకోవచ్చని అంచనా వేశారు.

బయటకు రావొద్దు.. జాగ్రత్త

ఎండల తీవ్రత, వడగాడ్పుల దృష్ట్యా ప్రజలు వీలైనంత వరకు ఉదయం 11నుంచి సాయంత్రం 4గంటల వరకు ఇళ్లల్లోనే ఉండాలని వాతావరణ శాఖ అధికారులు సూచించారు. ఎండ దెబ్బ తగలకుండా టోపీ, గొడుగు, టవల్, కాటన్ దుస్తులు ఉపయోగించాలన్నారు. వృద్ధులు, గర్భిణులు, బాలింతలు చెవుల్లోకి వేడిగాలి వెళ్లకుండా జాగ్రత్త పడాలని సూచిస్తున్నారు. గుండెజబ్బులు, షుగర్, బీపీ ఉన్న వారు ఎండలో తిరగకూడదని స్పష్టం చేశారు. శారీరక శ్రమతో కూడిన కఠినమైన పనులను ఎండలో చేయ రాదని విపత్తుల సంస్థ ఎండీ కూర్మనాథ్ సూచించారు.

ప్రజల సంతోషమే టీడీపీ అజెండా

● లావు శ్రీకృష్ణదేవరాయలు



మాట్లాడుతున్న ఎంపీ లావు పక్కన డాక్టర్ అరవిందబాబు తదితరులు

నరసరావుపేటటౌన్, మే3: ప్రజలందరూ సంతోషంగా జీవించటమే టీడీపీ అజెండా అని, మా దృష్టి అంతా ప్రజల అభివృద్ధి, సంక్షేమంపైనే నని టీడీపీ నాయకులు అన్నారు. శుక్రవారం నరసరావుపేట పట్టణంలోని 30, 31. 32. 33. 34 వార్డులలో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, డాక్టర్ చదలవాడ అరవిందబాబు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలను ఇబ్బంది పెట్టేవిధంగా మా పాలన ఉండదని, నరసరావుపేట పట్టణ రూపురేఖలు మారుస్తామన్నారు. సూపర్ సిక్స్ పథకాలతో ప్రజల జీవితాలలో వెలుగురేఖలు నింపుతామని, ఎన్నికల సమీపంలో ఉన్నందున ప్రతి ఒక్కరు సైన్యంలా పనిచేయాలన్నారు. నరసరావుపేట మున్సిపాలిటీ పరిధిలోని అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకువెళ్ళే బాధ్యతను డాక్టర్ చదలవాడ అరవిందబాబు, జనసేన రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ జిలాని అందరం కలిసి తీసుకుంటామని వెల్లడించారు. ప్రతీ గ్రామంలో, వార్డులలో సైడ్ కాలువలు, డ్రెయినేజ్ వ్యవస్థ, తాగునీటి సమస్యను పరిష్కరించడానికి ప్రణాళికను కూడా సిద్ధం చేసుకున్నామన్నారు. ఉమ్మడి కూటమి తీసుకురాబోతున్న సూపర్ సిక్స్ పథకాలు పేదల జీవితాల్లో వెలుగులు నింపుతాయని అన్నానరు. ముస్లింలు ఏ ఆపోహలు పెట్టుకోవద్దని, ఎన్ఆర్‌సీ, 4శాతం రిజర్వేషన్ మీద కూటమి అండగా నిలబడుతుందన్నారు. నరసరావుపేట గడ్డమీద తెలుగుదేశం జెండా ఎగిరేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో జనసేన రాష్ట్రకార్యదర్శి సయ్యద్ జిలాని, టీడీపీ, జనసేన, బీజేపీ అభిమానులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.



టీడీపీలో చేరిన కత్తి చలమరాజు తదితరులతో యరపతినేని

టీడీపీలోకి వైసీపీ లీగల్ సెల్ కన్వీనర్..

గురజాలటౌన్, మే 3: గురజాలలో వైసీపీకి మరో షాక్ తగిలింది. శుక్రవారం పిడుగురాళ్లలోని టీడీపీ కార్యాలయంలో వైసీపీ లీగల్ సెల్ కన్వీనర్ కత్తి చలమరాజు ఆ పార్టీని వీడి టీడీపీలో చేరారు. చలమరాజు ఆధ్వర్యాన 19వ వార్డు కౌన్సిలర్ కత్తి రామాదేవి రవిబాబు, కుక్కమూడి ఏసురత్నం, కత్తి దానం, అట్లూరి చిన్ని ఆదూరి ప్రవీణ్, పులిగుజ్జు రవికిరణ్, బంక కోటేశ్వరరావులు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి యరపతినేని పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు అడపా శ్రీనివాసరావు, కత్తి ప్రసంగి, మాజీ ఎంపీటీసీ శరమాళ్ల హనుమంతురావు, కుక్కమూడి కల్యాణ్, కోటి తదితరులు పాల్గొన్నారు.



సంఘ నేతలతో కలిసి కరపత్రాలు విడుదల చేస్తున్న మనోహార్

మాదిగలకు ద్రోహం చేసిన వైసీపీ

● మాదిగల కుల సంఘ జేఏసీ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు మాదిగ

తెనాలి రూరల్, మే 3: మాదిగలను అన్ని విధాలుగా వంచనచేసిన వైసీపీ ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికలో గద్దెదించి ఉమ్మడి పార్టీల అభ్యర్థులను గెలిపించాలని మాదిగ కుల సంఘాల జేఏసీ అధ్యక్షుడు పేరుపోగు వెంకటేశ్వరరావు మాదిగ పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ పీఏసీ ఛైర్మన్, తెనాలి ఉమ్మడి పార్టీల ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్‌ను కలిసి మద్దతు ప్రకటించి కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాదిగ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు నవరత్నాల పేరు మీద దారి మళ్లించి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాదిగలకు తీరని అన్యాయం చేశారని విమర్శించారు. ఎస్సీలు కలలు కంటున్న వర్గీకరణ బిల్లు సాధించాలంటే టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికే మద్దతు తెలపాలని పిలుపునిచ్చారు. దళిత వర్గాల ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు చెట్టి రాజు మాట్లాడుతూ దళిత ఓట్లతో గద్దెనెక్కిన జగన్మోహన్ రెడ్డి దళితుల అభ్యున్నతిని కుంటుపరిచి, దళితులపై దాడులకు పాల్పడుతూ వారి శవాలను డోర్ డెలివరీ చేసిన హంతకులకు అండగా నిలిచి దుర్మార్గంగా వ్యవహరించారని విమర్శించారు. చర్మకార సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వేజెండ్ల సుబ్బారావు, బేడ బుడగ జంగం సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వనం నాగేశ్వరరావు, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు కొవెవరపు కోటేశ్వరరావు మాదిగ, డీపీఎఫ్ తెనాలి మండల అధ్యక్షుడు సుద్ధపల్లి శశికిరణ్ తదితరనాయకులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ హత్యకేసులో

ముగ్గురికి జీవిత ఖైదు

రెంటచింతల, మే 3 : మండలంలోని పశర్లపాడు గ్రామ మాజీ సర్పంచ్ చింతమళ్ల పెద వెంకటేశ్వర్లు హత్య కేసులో ముగ్గురు వ్యక్తులకు జీవిత ఖైదు విధిస్తూ గుంటూరు 5వ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి కె.నీలిమ శుక్రవారం తీర్పు ఇచ్చినట్లు ఎస్ఐ కేవీ నారాయణరెడ్డి తెలిపారు. ఈ ఘటన 2015 సెప్టెంబరు 18న వినాయక నిమజ్జనం అనంతరం జరిగిన ఘర్షణలో ఈ హత్య చోటు చేసుకుంది. మొదటి నిందితుడు దాసి మల్లికార్జునరావుకు యావజ్జీవ శిక్షతో పాటు రూ.15 వేలు జరిమానా, 2, 3వ నిందితులైన దొడ్డా బ్రహ్మయ్య, వెంకటేశ్వర్లుకు యావజ్జీవ శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా, 6వ, 8వ ముద్దాయిలైన దాసి బాలసైదులు, సాయి కుమార్‌లకు 4 సంవత్సరాల శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధించారు. మిగిలిన 9 మందిపై నమోదైన కేసును కొట్టివేస్తూ తీర్పునిచ్చారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా 5వ ఏడీజె కోర్టుకు చెందిన పల్లపు కృష్ణ వ్యవహరించగా అప్పటి గురజాల రూరల్ సీఐ అలహరి శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు.

మద్యం కేసులో వైసీపీ నేత అరెస్టు

నరసరావుపేట లీగల్, మే 3: అక్రమంగా మద్యం తరలిస్తున్న పట్టణానికి చెందిన 8వ వార్డు మాజీ కౌన్సిలర్, వైసీపీ నేత షేక్ సత్తార్‌ను నరసరావుపేట స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సిబ్బంది శుక్రవారం సాయంత్రం అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి మద్యంతో పాటు ఓ వాహనాన్ని కూడా స్వాధీనం చేసుకున్నామని సీఐ బి.నయన తార తెలిపారు. ఈ కేసుకు సంబందించి నాగశేషు అనే మరో వ్యక్తిని కూడా అరెస్టు చేశామని తెలిపారు. నిందితుల వద్ద నుంచి 16 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామన్నారు.



గ్రామానికి చేరిన ఆత్మకూరు టీడీపీ నేతలు, కార్యకర్తలు

సొంతూరుకు ఆత్మకూరు టీడీపీ నేతలు

దుర్గి, మే 3: మండలంలోని ఆత్మకూరుకు చెందిన టీడీపీ నేతలు 2019 ఎన్నికల అనంతరం గ్రామం వదిలి వెళ్లిపోయారు. వైసీపీ దాడులు, పోలీసుల వేధింపులు తాళలేక గ్రామం వదిలి టీడీపీకి చెందిన 90 కుటుంబాలు వేరే గ్రామాల్లో నివసిస్తున్నాయి. సార్వత్రిక ఎన్నికలు దృష్టిలో పెట్టుకొని పోలీసులు చర్చలు జరిపి అండగా ఉంటామని హామీనిచ్చి శుక్రవారం సొంత గ్రామానికి తీసుకొచ్చారు. వైసీపీ, టీడీపీ నేతలను పిలిపించి సంధి కుదిర్చారు. సీఐ చినమల్లయ్య మాట్లాడుతూ అన్నదమ్ముల్లా అందరూ కలిసిమెలిసి ఉండాలని, రాజకీయ నేతల మాటలు నమ్మి కుటుంబాలను రోడ్డుపాలు చేసుకోవద్దని అన్నారు. ఎవరైనా సమస్యలు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సీఆర్పీఎఫ్ బలగాలు పహారా కాస్తాయని, స్వేచ్ఛగా ఓటు వేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ కోటయ్య, గ్రామస్థులు పాల్గొన్నారు.



వంగవీటి రాధాను సన్మానిస్తున్న పెమ్మసాని, గల్లా మాధవి, దేగల ప్రభాకర్

బటన్ నొక్కి అలసిన జగన్‌ను ఇంటికి పంపిద్దాం

● కాపు సామాజిక వర్గానికి వంగవీటి రాధా పిలుపు
● పవన్‌లాగే నేను కూడా ప్రజలకోసం వచ్చా: పెమ్మసాని

గుంటూరు, మే 3(ఆంధ్రజ్యోతి): 'బటన్ నొక్కినొక్కి జగన్ అలిసిపోయాడు.. ఈనెల 13న మనం బటన్ నొక్కి ఆయనను ఇంటికి పంపుదాం' అంటూ టీడీపీ స్టార్ క్యాంపెయినర్ వంగవీటి రాధా పిలుపునిచ్చారు. గుంటూరు వివాహ కన్వెన్షన్ సెంటర్లో ఎన్డీఏ కూటమి కాపు నేతల సమావేశం శుక్రవారం జరిగింది. ఈసమావేశంలో వంగవీటి రాధాకృష్ణ, గుంటూరు పార్లమెంటు కూటమి అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్, పశ్చిమ అభ్యర్థి గల్లా మాధవి, నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్ పాల్గొన్నారు.

సమావేశంలో వంగవీటి రాధా మాట్లాడుతూ మన ప్రాంతాన్ని మనం కాపాడుకోవటం మన చేతుల్లో ఉంది. అందుకోసం ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఆయన కోరారు. కులాన్ని స్వార్థం కోసం వాడుకుని పదవులు పొందితే అవి కొంతకాలమే వుంటాయని, వంగవీటి రంగా ప్రజలకోసం నిలబడడంవల్లే ప్రజల గుండెల్లో నిలిచిపోయా రన్నారు. ఓట్లు చీలకూడదన్న తన మాటకు కట్టుబడి పవన్ తక్కువ సీట్లు తీసుకున్నారన్నారు. జగన్‌రెడ్డి 'సిద్ధం' అంటే జనసైనికులు'సై' అంటున్నార న్నారు. కూటమి అభ్యర్థులను గెలిపించే బాధ్యత అందరం తీసుకుందామ న్నారు. గుంటూరు సమస్యలను గల్లా జయదేవ్ పార్లమెంటులో వినిపించారు. ఇప్పుడు పెమ్మసాని చంద్రశేఖర్ ముందుకువచ్చారు. ఆగిపో యిన అమరావతి నిర్మాణం ముందుకు సాగాలంటే పెమ్మసాని గెలవాలి. గుంటూరు పశ్చిమ నుంచి పోటీ చేస్తున్న పిడుగురాళ్ల మాధవిని గెలిపించాలి అని ఆయన చెప్పారు. ప్రత్తిపాడు నుంచి పోటీ చేస్తున్న విశ్రాంత ఐఏఎస్ బూర్ల రామాంజనేయులును అత్యధిగ మెజార్టీతో గెలిపించుకోవాల్సిన అవసర ముందని అన్నారు. అమరావతే రాజధానిగా ఉండాలన్న నినాదాన్ని ప్రపంచ మంతా చాటాలని చెప్పారు. 'చేయి చేయి కలుపు.. చేజారదు గెలుపు అన్న వంగవీటి రంగా మాటలు గుర్తు చేస్తూ.. కూటమి గెలుపుకు అందరూ ఐక్యంగా నిలవాలని కోరారు. మీరు చూపించే అభిమానం ఈనెల 13న ఓటురూపంలో ఉండాలని అన్నారు.



కాపుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ పెమ్మసాని

పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ భావజాలం తనకు బాగా నచ్చిందని, తనకెంతో ఇష్టమని అన్నారు. 'ఆయన ప్రజల కోసం వచ్చారు. నేను కూడా అందుకే వచ్చాను. నీతి, నిజాయతి ఉన్న ఎవరికైనా ఆవేశం ఉంటుంది. అందుకే మేం కలిశాం' అన్నారు. అన్ని కులాల వారితో కలిసి పనిచేయటం వల్లే ఈ స్థాయికి వచ్చానని తెలిపారు. వంగవీటి రంగా కుమారుడు రాధా మంచి ఆశయంతో టీడీపీలో కొనసాగుతున్నారని, కూటమి గెలుపుకు ఎంతో కృషి చేస్తున్నారని అన్నారు. విడదల రజిని ఒక్కసారికే విపరీతమైన వ్యతిరేకత మూటగట్టుకున్నారన్నారు. మంత్రిగా విపరీతమైన అవినీతి చేసి.. ఆ డబ్బుతో గెలవాలని చూస్తున్నారన్నారు. ఓటమి భయంతోనే జగన్ కాపులకు సీట్లిచ్చారని విమర్శించారు. జగన్‌వద్ద ఉండాలంటే ఆత్మాభిమానం చంపుకుని పనిచేయాలని, స్వాభిమానం వున్నవారు ఆయనవద్ద ఉండలేరని చెప్పారు. కులం కాకుండా గుణం చూసి ఓట్లు వేయాలని ఆయన ప్రజలను కోరారు. కార్యక్రమంలో వడ్డాణం హరిబాబు, టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు, కార్యకర్తలు, కాపు నేతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



వైసీపీని వీడి టీడీపీలో చేరిన వారితో ప్రత్తిపాటి పుల్లారావు

ఐదేళ్లలో ప్రజా పంపిణీ వ్యవస్థ నాశనం

● మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, మే 3: పొరపాటున ఎవరైనా వైసీపీకి ఓటు వేసి జగన్ మళ్ళీ ముఖ్యమంత్రి ఐతే రాష్ట్రంలో ప్రజా పంపిణీ పెను ప్రమాదంలో పడినట్లేనని మాజీ మంత్రి, చిలకలూరిపేట కూటమి అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని పలు వార్డుల నుంచి అధికార వైసీపీ నేతలు పెద్ద ఎత్తున టీడీపీలో చేరారు. 27వ వార్డులో షేక్ యాసిన్, నన్ని, ఇంతియాజ్ ఆధ్వర్యంలో 80మంది, 28వవార్డు నుంచి శీలం నాగేశ్వరరావు ఆధ్వర్యంలో కాపు కులానికి చెందిన నలుగురు ముఖ్య నాయకులతో పాటు వారి అనుచరులు, మల్లెల రాజేష్ నాయుడు, గుంజి వీరాంజనేయులు ఆధ్వర్యంలో 13, 17 డివిజన్‌ల నుంచి 20 ఎస్సీ కుటుంబాలు, 38వ వార్డు వైఎస్ఆర్ కాలనీకి చెందిన 20 ఎస్సీ, ఎస్టీ కుటుంబాలు, 29వ డివిజన్‌లో షేక్ కరిముల్లా ఆధ్వర్యంలో నాలుగు కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వేర్వేరుగా జరిగిన ఈ కార్యక్రమాల్లో వారందరికీ ప్రత్తిపాటి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించి మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ళ పాలనలో పౌర సరఫరాల వ్యవస్థను సర్వనాశనం చేశారని ధ్వజ మెత్తారు. అనేక మార్గాల్లో గ్రామాల్లో, పట్టణాల్లో లక్షల తెల్లకార్డులు తొలగించారని, తద్వారా ప్రభుత్వ పథకాలకు ప్రజలను దూరం చేసేందుకు కుట్ర పన్నారని దుయ్యబట్టారు. సంక్రాంతి, క్రిస్మస్, రంజాన్ కానుకలు ఎత్తివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితులు మారాలంటే కూటమి ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకు రావాలని, సైకిల్ గుర్తుకు ఓట్లు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా శ్రీకృష్ణ దేవరాయలను మంచి మెజార్టీతో గెలిపించాలని ప్రత్తిపాటి కోరారు.





ఎమ్మెల్యే గోపిరెడ్డికి హారతి ఇస్తున్న అంగన్ వాడీ వర్కర్ భాగ్యలక్ష్మి, ఎమ్మెల్యేను సత్కరిస్తున్న డ్వాక్రా సీసీ నక్షత్రం

ఎన్నికల కోడ్ ఉల్లంఘన

నరసరావుపేట అర్బన్,మే3: మండలంలోని అన్నవరం గ్రామంలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి శుక్రవారం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు ఎన్నికల ప్రచారంలో పాల్గొన కూడదని ఎన్నికల కమిషనర్ ఆదేశాలు జారీచేసినా పలువురు పట్టిపట్టనట్టు వ్యవహరిస్తున్నారు. అన్నవరం గ్రామానికి చెందిన డ్వాక్రా సీసీ నక్షత్రం, అంగన్ వాడీ వర్కర్ భాగ్యలక్ష్మీలు ఎన్నికల ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు. ఒకరు ఎమ్మెల్యేను సన్మానించగా మరొకరు ఆయనకు హారతులు ఇచ్చి స్వాగతం పలికారు.

మూడు ముక్కలాటతో అమరావతి నిర్వీర్యం

● 1599వ రోజుకు చేరుకున్న ఆందోళనలు



వెంకటపాలెం శిబిరంలో నినాదాలు చేస్తున్న మహిళలు

తుళ్లూరు, మే3: జగన్‌రెడ్డి మూడు ముక్కలాటతో రాష్ట్ర రాజధాని అమరావతి నిర్వీర్యం అయ్యిందని, ల్యాండ్ టైటిలింగ్ యాక్టు పెట్టి రాష్ట్ర ప్రజల ఆస్తులకు టెండర్ పెట్టాడని, వైసీపీకి ఓటు వేస్తే మీ ఆస్తులు మీ చేతిల్లో ఉండవని రాజధానికి భూములు త్యాగం చేసిన రైతులు ఆరోపించారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు ధర్నా శిబిరాలు, ఇళ్ల వద్ద నుంచి చేస్తున్న ఆందోళనలు శుక్రవారం నాటికి 1599వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడారు. ఒక్క చాన్స్‌తో రాష్ట్రాన్ని సర్వ నాశనం చేశారన్నారు. అన్నీ వ్యవస్థలు వైసీపీ ప్రభుత్వంలో నిస్తేజం అయ్యాయన్నారు. మూడు రాజధానులని రాష్ట్రం ఏ విధంగా అధోగతి పాలైందో ఓటర్లు గమనించాలన్నారు. విజనరి ఉన్న నాయకుడు సీఎం కావాలన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. దీపాలు వెలిగించి బిల్డ్ అమరావతి, జై ఆంధ్రప్రదేశ్ అంటూ నినాదాలు రాజధాని 29 గ్రామాల్లో రైతుల ఆందోళన కొనసాగింది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.50 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	142, 151,162
చికెన్ విత్ స్కిన్	274.00
చికెన్ స్కిన్ లెస్	284.00

65,876 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు శుక్రవారం 50,957 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 65,876 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 48,249 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	9000	18500
నెంబరు. 5	9000	13000
273	10000	11000
341	8500	18000
4884	9000	14000
సూపర్ 10	16000	16000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	20000
బ్యాడిగి	9000	17000
దేవనూరు డీలక్స్	9000	16000
తెల్లకాయలు	5000	11000

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె

యువశక్తిని అద్భుత మేధాశక్తిగా దేశానికి అందించటమే లక్ష్యం

● టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన



యువ సమ్మేళనంలో మాట్లాడుతున్న కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి నరేంద్రవర్మ

బాపట్ల, మే 3 : యువశక్తిని అద్భుతమైన మేధాశక్తిగా దేశానికి అందించటమే లక్ష్యంగా తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు పని చేస్తున్నారని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ అన్నారు. బాపట్లలోని కమ్మ కల్యాణ మండపంలో శుక్రవారం యువసమ్మేళనం నిర్వహించారు. యువతకు ఉద్యోగ, ఉపాధి కోసం చంద్రబాబు మళ్ళి రావాలి అనే అంశంపై నిర్వహించిన ఈ కార్యక్రమానికి నరేంద్రవర్మ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ భారతదేశ భవిష్యత్తు యువతరంపై ఆధారపడి ఉందన్నారు. ఉద్యోగ, ఉపాధి రంగాలలో వారికి అద్భుతమైన అవకాశాలను కల్పించటమే లక్ష్యంగా కూటమి పని చేస్తుందన్నారు. నిరుద్యోగుల కోసం 20 లక్షల ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనే లక్ష్యంగా పని చేస్తామన్నారు. ఉద్యోగం వచ్చే వరకు నెలకు రూ.3 వేల నిరుద్యోగభృతి ఇవ్వటం జరుగుతుందన్నారు. యువత కోసం చంద్రబాబు ప్రత్యేక అజెండా రూపొందించారన్నారు. జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త నామన వెంకటశివన్నారాయణ మాట్లాడుతూ చంద్రబాబు, పవన్‌కళ్యాణ్, నరేంద్రమోదీ కలయికతో యువతకు మంచి భవిష్యత్తు లభిస్తుందన్నారు. యువతరం కూటమికి మద్దతుగా ఉండాలని కోరారు. జాబ్ రావాలంటే బాబు రావాలని కార్యక్రమంలో యువత ప్లేకార్డులు ప్రదర్శిస్తూ నినదించారు. కార్యక్రమంలో జిల్లా యువమోర్చా అధ్యక్షుడు నాసిన మణికుమార్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, పార్టీ మండల అధ్యక్షుడు ముక్కామల సాంబశివరావు, నియోజకవర్గ పరిశీలకులు శివసాంబిరెడ్డి, తెలుగుయువత అధ్యక్షులు ఉమ్మారెడ్డి వెంకటేష్, శ్రీకృష్ణ, ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.



నరేంద్రవర్మతో కలిసి సమావేశంలో మాట్లాడుతున్న షేక్ రఫీ

కూటమితోనే ముస్లింల సంక్షేమం సాధ్యం

● సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ రఫీ

బాపట్ల, మే 3 : కూటమితోనే ముస్లింల సంక్షేమం సాధ్యమని ముస్లిం సంక్షేమ సం ఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ రఫీ అన్నారు. ఎన్డీయే కూటమి విజ యం కోరుతూ చేపట్టిన రాష్ట్ర పర్యటనలో భాగంగా శుక్రవారం బాపట్ల విచ్చేసిన ఆయన కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మతో కలిసి విలేకర్లతో మాట్లాడుతూ వైసీపీ తప్పుడు ప్రచారాలు ప్రజలు నమ్మరాదన్నారు. బీజేపీతో పొత్తుపెట్టుకుందని టీడీపీకి ఓటు వేయరాదనే ప్రచారాన్ని నమ్మరాదన్నా రు. గతంలో తెలుగుదేశం బీజేపీతో పొత్తుపెట్టుకున్నప్పటికి ముస్లింలకు ఏవిధమైన నష్టం జరగలేదన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ముస్లింలకు తీరని ద్రోహం చేశారన్నారు. నాలుగుశాతం రిజర్వేషన్ తీసేస్తారనే ప్రచారం సరికాదన్నారు. రిజర్వేషన్ కాపాడింది చంద్రబాబేనన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మీరా సాహెబ్, బాపట్ల అధ్యక్షుడు షేక్ ఇలియాజ్, జిల్లా అధ్యక్షుడు షేక్ దిలీప్, షేక్ పీరాసాహెబ్, గుంటూరు నాయకులు ఎస్కే ముస్తఫా, స్థానిక నాయకులు పఠాన్ రాజేష్, తాజుద్దీన్, కరీముల్లా, నాయబ్ రసూల్, నిజాం తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ, కాంగ్రెస్ నుంచి టీడీపీలోకి భారీ వలసలు



మాజీ కౌన్సిలర్‌లు షేక్ అస్మతుల్లాబేగ్, కొటికలపూడి రత్నకుమారి, కాపు నాయకులకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న నరేంద్రవర్మ

బాపట్ల, మే 3 : బాపట్లలోని వైసీపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన నాయకులు పెద్ద ఎత్తున టీడీపీలోకి వలసలు వస్తున్నారు. టీడీపీ, జనసేన,బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ వారికి టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. 30వ వార్డు మాజీ కౌన్సిలర్ షేక్ అస్మతుల్లాబేగ్, 16వవార్డు మాజీ కౌన్సిలర్ కొటికలపూడి రత్నకుమారి, 24వ వార్డు నుంచి కాపుసంఘ కార్యదర్శి పాలెం సుబ్బారావు, కార్పెంటర్ అసోసియేషన్ నుంచి దేవిరెడ్డి సుబ్బారావు, ఇమ్మడిశెట్టివారిపాలెం నుంచి ఇమ్మడిశెట్టి నాగరాజు, దర్గాపెదమస్తాన్ నగర్ నుంచి బీకే నాయుడు, హనుమంతరావు నగర్ నుంచి భీమా కోటేశ్వరరావు, దరివాద కొత్తపాలెం నుంచి దొంతిన రామిరెడ్డి, కోకి రామిరెడ్డిలు పార్టీలో చేరగా వారికి నరేంద్రవర్మ కండువాలు కప్పి చేర్చుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ నరాలశెట్టి ప్రకాశరావు, తిరుమలశెట్టి సాంబశివరావు, కొటికలపూడి సురేష్, చేజర్ల సతీష్, జీకే నాయుడు తదితరులు ఉన్నారు.

● పట్టణంలోని 4వ వార్డు మాజీ కౌన్సిలర్ ఆతిన ప్రతాప్‌కుమార్ తన అనుచరులతో కలిసి శుక్రవారం తెలుగుదేశం పార్టీలో చేరారు. వేగేశన నరేంద్రవర్మ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ప్రతాప్‌కుమార్‌తోపాటు కరీం, దావూద్, ఎడ్విన్, పిన్నిబోయన కోటేశ్వరరావు టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ పులివాసు, చాపా సోమయ్య, జిట్టా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ పార్టీ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు పఠాన్‌రాజేష్‌కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న వేగేశన నరేంద్రవర్మ

● జిల్లా కాంగ్రెస్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు పఠాన్ రాజేష్ తన అనుచరులతో కలిసి శుక్రవారం తెలుగుదేశం పార్టీలో చేరారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ వారికి కండువాలు కప్పి పార్టీలో చేర్చుకున్నారు. తెలుగుదేశం అభ్యర్థుల విజయానికి శక్తివంచనలేకుండా పని చేస్తామన్నారు. పార్టీలో చేరిన వారిలో షేక్.తాజుద్దీన్, కరీముల్లా, నాయబ్ రసూల్ ఉన్నారు.

ఇంటింటికి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మండల, గ్రామ టీడీపీ నాయకులు

పిట్టలవానిపాలెం, మే 3 : బాపట్ల నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు వేగేశన నరేంద్రవర్మ, తెన్నేటి కృష్ణప్రసాద్‌ల విజయాన్ని కాంక్షిస్తూ పిట్టలవానిపాలెం మండల, గ్రామ కూటమి నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి ప్రచారం నిర్వహించి ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో మండల, గ్రామస్థాయి కూటమి నాయకులు, మండల టీడీపీ అధ్యక్షుడు ఎండీ అఫ్జల్, మండల తెలుగుమహిళా అధ్యక్షురాలు డాక్టర్ గ్లోరి యానేట్ సోపాటి, టీడీపీ సీనియర్ నాయకులు లక్కంరాజు వెంకటపతిరాజు, ఆయా గ్రామాల టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జిలు కనుమూరి సాంబమూర్తిరాజు, జాలాది లోకరాజ్యుడు, మోదుగుల శంకర్‌రెడ్డి, మండల తెలుగుయువత కార్యదర్శి కె.కిషోర్‌రెడ్డి, భవనవారిపాలెం సర్పంచ్ మోదుగుల శివనాగేశ్వరి, భవనవారిపాలెం గ్రామ టీడీపీ అధ్యక్షుడు కలకోట చక్రధర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి చందోలు కోటి లింగాచారి తదితరులుపాల్గొన్నారు.

చీరాల గోవర్ధనరెడ్డికి సన్మానం

కర్లపాలెం, మే 3 : మండలంలోని ఏట్రవారిపాలేనికి చెందిన మాజీ ఎమ్మెల్యే, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చీరాల గోవర్ధనరెడ్డి, జడ్పీటీసీ పిట్ల వేణుగోపాలరెడ్డిలను రెడ్డి సేవామిత్ర తరుపున రెడ్డి సోదరులు శుక్రవారం దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. గోవర్ధనరెడ్డికి టీడీపీ తరుపున రాష్ట్ర ఉపాధ్యక్షులుగా నియమించినందుకు రెడ్డి సేవామిత్ర తరుపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళ్ళం హరినాధరెడ్డి, భోగిరెడ్డి రమేష్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర రైతు సంఘం ఉపాధ్యక్షుడు బొంతు శివసాంబిరెడ్డి, జడ్పీటీసీ వేణుగోపాలరెడ్డి, రెడ్డి సేవామిత్ర అధ్యక్షులు నంగు గోవర్ధనరెడ్డి, అక్కల లక్ష్మీనారాయణరెడ్డి, ఆట్ల బాల శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ స్కానింగ్ సెంటర్‌లను తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో

బాపట్ల, మే 3 : పట్టణంలోని ప్రైవేట్ స్కానింగ్ సెంటర్‌లను శుక్రవారం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ ఎస్.విజయమ్మ ఆకస్మిక తనిఖీ చేశారు. అల్ట్రాసౌండ్ పరీక్షా కేంద్రాలను పరిశీలించి నిర్వాహకులకు తగు సూచనలు చేశారు. పీసీపీఎన్‌డీటీ యాక్ట్ ప్రకారం ప్రతి స్కానింగ్ సెంటర్‌లో నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. 5 సంవత్సరాలకు ఒకసారి రెన్యువల్ చేయించాలన్నారు. ప్రతి స్కానింగ్ సెంటర్‌లో రికార్డులు సక్రమంగా ఉండేలా చూడాలని, చట్ట వ్యతిరేకంగా లింగనిర్ధారణ పరీక్షలకు ఎవరైన పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రాష్ట్రాన్ని గాడిన పెట్టేందుకే కూటమి ప్రభుత్వం

● చైతన్యంతో జగన్ పాలనకు బుద్ధి చెప్పండి

● మాజీ మంత్రి ఆనందబాబు



జంపనిలో ఆనందబాబుకు హారతులు ఇచ్చి స్వాగతం పలుకుతున్న మహిళలు

వేమూరు, మే 3 : జగన్మోహనరెడ్డి ప్రజాస్వామ్య వ్యతిరేక పాలన ద్వారా దెబ్బతిన్న రాష్ట్రాన్ని గాడిన పెట్టేందుకు కూటమి ప్రభుత్వం రాబోతోందని మాజీ మంత్రి, వేమూరు అసెంబ్లీ కూటమి అభ్యర్థి నక్కా ఆనందబాబు అన్నారు. టీడీపీ, జనసేన పార్టీల శ్రేణులు వేమూరు మండలం జంపని గ్రామంలో శుక్రవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆనంద్‌బాబు పాల్గొన్నారు. గ్రామ ప్రజలు ఆయనకు బాణాసంచా, రాజస్థానీ బ్యాండ్ యువత కేరింతలతో ఘనంగా స్వాగతం పలికారు. మహిళలు కర్పూర హారతులు, తిలకం దిద్ది స్వాగతించారు. ఆనందబాబు ఉమ్మడి మ్యానిఫెస్టో కరపత్రాలను గ్రామంలో పంపిణీ చేశారు. అనంతరం ప్రచార రథంపై నుంచి మాట్లాడుతూ ఒక్క ఛాన్స్ ఇవ్వండి అంటూ ప్రజల ముందుకు వచ్చి అవకాశాన్ని చేజిక్కించుకున్న అనంతరం ప్రజలను నయవంచన చేసిన ఘనుడు ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి అని తీవ్రంగా విమర్శించారు. చంద్రబాబునాయుడు పాలనలో రైతులకు ఎంతో మేలు జరిగిందని, సాగునీటిని సకాలంలో అందించడంతో పాటు రవాణా సౌకర్యాలు కల్పించి వ్యవసాయ శాఖ ద్వారా సబ్సిడీ పథకాలు అమలు చేస్తూ పండించిన పంటలకు గిట్టుబాటు ధరలను కల్పించి ప్రభుత్వమే వాటిని కొనుగోలు చేసిందని ఆ విధానం ఈ రోజున అమలులో లేదన్న విషయం ప్రతి రైతు గమనించాలన్నారు. మంత్రిగా, ఎమ్మెల్యేగా పని చేసిన వ్యక్తి కోట్ల రూపాయల దండుకున్నాడు కానీ ఎక్కడైనా అభివృద్ధి పనిని చేపట్టాడా అన్నారు. అలాంటి వ్యక్తికి ప్రజలు బుద్ధి చెప్తారు అన్న విషయాన్ని ముందుగానే గ్రహించి ఆరు నెలల ముందే పలాయనం చెందారని విమర్శించారు. ఆయన స్థానంలో మరో వ్యక్తిని తీసుకురావడం జరిగిందని, ఆ వ్యక్తి ప్రకాశం జిల్లాలో ప్రజలను మోసం చేసి నియోజకవర్గానికి రావడం జరిగిందన్నారు. ఆ వ్యక్తి కేవలం అధికారం కోసం డబ్బు విరజిమ్మి మోసపూరితపు మాటలతో ఓట్లు దండుకోవడానికి ప్రయత్నిస్తున్నాడన్నారు. అంతే కాకుండా గ్రామాల్లో రౌడీమూకను దింపారని, రైతులు ప్రజల మధ్య వర్గ వైశమ్యాలు కల్పిస్తున్నారన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. షుగర్ ఫ్యాక్టరీ ఉద్యోగుల సమస్యల పరిష్కారంతో పాటు నియోజకవర్గంలోని అన్ని సమస్యలను కూటమి ప్రభుత్వం ద్వారా పరిష్కరించడంతో పాటు ప్రజలకు అన్ని విధాలుగా అండగా ఉంటానని అన్నారు. తనతో పాటుగా బాపట్ల ఎంపీ కూటమి అభ్యర్థిగా బరిలో ఉన్న కృష్ణప్రసాద్‌ను కూడా సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి అఖండ మెజార్టీని అందించాలని కోరారు. కార్యక్రమంలో బాపట్ల పార్లమెంటరీ స్థాయి టిడిపి అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు, నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త ఊసా రాజేష్, జనసేన పార్టీ ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యదర్శి సోమరౌతు అనురాధ, టీడీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ గ్రామ పార్టీ అధ్యక్షులు షేక్ హనీఫ్, టీడీపీ బీసీ సెల్ నాయకులు పల్లా వాసుదేవరాయుడు, ఎం.రెడ్డయ్య, భోగి అంకమ్మరావు, ఎస్సీ సెల్ నాయకులు వేల్పుల రవి, కన్నెగంటి సురేష్, తెలుగు యువత అధ్యక్షులు కలవ మణికంఠ, కొడాలి వెంకటరావు, గమిని లక్ష్మీదుర్గ, మన్నే లక్ష్మీ, నాదెండ్ల సురేష్, జనసేన పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కాలవ వెంకటసుబ్బయ్య, గుప్తా, గ్రామ పార్టీ అధ్యక్షులు బండారు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

జగన్ కుట్రలు, కుయుక్తులు ప్రజలు గమనించాలి

అమృతలూరు, మే 3 : ఎలాగైనా మళ్లీ ఎన్నికల్లో గెలిచేందుకు జగన్ కుట్రలు, కుయుక్తులు పన్నుతున్నాడని, ప్రజలంతా గమనించి మళ్లీ మోసపోకుండా కూటమికి ఓటు వేసి గెలిపించాలని కూటమి అభ్యర్థి నక్కా ఆనందబాబు కోరారు. శుక్రవారం సాయంత్రం మండలపరిధిలోని యడవూరులో కూటమి అభ్యర్థి ఆనంద బాబు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రచారానికి ప్రజల నుంచి అపూర్వ ఆదరణ లభించింది. మహిళలు హారతులు ఇచ్చి ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఆనందబాబు మాట్లాడుతూ గత ఎన్నికల్లో జగన్ పాదయాత్రతో ప్రజల నుంచి సానుభూతి పొంది మోసపూరిత వాగ్దానాలతో గద్దెనెక్కాడని, ఈ ఐదేళ్లలో ఓటు వేసి గెలిపించిన అన్ని వర్గాలను వంచించాడన్నారు. అభివృద్ధి సంక్షేమం, టీడీపీ రెండు కళ్లు అని రాష్ట్రాన్ని మళ్లీ పురోగమనంలోకి తీసుకురావాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలన్నారు. టీడీపీ అభ్యర్థులైన తనకు, పార్లమెంట్ అభ్యర్థి తెన్నేటి కృష్ణప్రసాద్‌కు ఓటు వేసి అత్యధిక మెజారిటీలో గెలిపించాలని అభ్యర్థించారు. ప్రచారంలో జనసేన నియోజకవర్గ సమన్వయకర్త ఊసా రాజేష్, టీడీపీ, జనసేన నాయకులు, పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వలంటీర్లు



యడవూరు ప్రచారంలో ఆనందబాబు సమక్షంలో టీడీపీలో చేరిన వలంటీర్లు

వలంటీర్లు నక్కా ఆనందబాబు సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. శుక్రవారం సాయంత్రం యడవూరులో ఆనందబాబు ఎన్నికల ప్రచారం నిర్వహిస్తుం డగా గ్రామానికి 9 మంది వలంటీర్లు టీడీపీలో చేరారు. వారందరికి కూటమి ఆనందబావు కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ప్రచారంలో టీడీపీ నాయకులు కుర్రా లక్ష్మీనారాయణ, సర్పంచ్ కుర్రా నాగమల్లేశ్వరి, బొంతా ఆంజనేయులు, రాము, కార్యకర్తలు పాల్గొన్నారు.

నమ్మక ద్రోహానికి నిలువుటద్దం జగన్

చుండూరు మే 3 : నమ్మక ద్రోహానికి నిలువుటద్దం జగన్ అని.. ప్రజలు రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా నడిపిస్తాడని నమ్మి చేతికి పగ్గాలు అప్పగిస్తే ఆ నమ్మకాన్ని ఒమ్ము చేసి రాష్ట్రాన్ని తీర్చలేనంత అప్పుల కుప్పగా మార్చాడని ఆనందబాబు అన్నారు. శుక్రవారం మండలంలోని ఆలపాడు, కారుమూరుపాలెం, చినగాదెలవర్రు, చినపరిమి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జగన్ ఒక్క అవకాశం ఇస్తే రాష్ట్రాన్ని స్వర్గంగా చేస్తానని చెప్పి చివరికి సాగు, తాగునీరు కూడా అందించలేకపోయాడని తెలిపారు. జగన్ తన పరిపాలనలో ఇసుక దోపిడి, మద్యం, రౌడీ, కబ్జాలు గంజాయిలను గ్రామస్థాయి వరకు అందించిన ఘనత దక్కించుకున్నాడు.

వేమూరు నియోజకవర్గ ఎమ్మెల్యే, మంత్రి మేరుగ నాగార్జున అందినంత వరకు దోచుకుని ప్రజల నుంచి వ్యతిరేకత వ్యక్తం కావడంతో తట్టాబుట్టా సర్దుకుని నియోజకవర్గ ప్రజలకు ముఖం చూపించలేక చల్లాగా జారుకున్నాడు. ఈసైకో మత్తు పాలనను అంతం చేసి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకుందామని ఆనందబాబు పిలుపునిచ్చారు. ఈ ప్రచార కార్యక్రమంలో మండల తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



మహిళలను ఆప్యాయంగా పలకరిస్తున్న ఆనందబాబు

ప్రతి కుటుంబం ఆర్థిక బలోపేతానికి కృషి

● టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన

● నరేంద్రవర్మ ఎన్నికల ప్రచారానికి బ్రహ్మరథం



బాపట్ల 2వవార్డులో నరేంద్రవర్మను పూలమాలతో స్వాగతం పలుకుతున్న ప్రజలు,నాయకులు

బాపట్ల, మే 3 : ప్రతి కుటుంబం ఆర్థికంగా బలోపేతం కావటానికి సంకీర్ణప్రభుత్వం కృషి చేస్తుందని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ తెలిపారు. బాపట్లలోని 1వవార్డు జేతనీకాలనీ, 2వ వార్డు క్రిస్టియన్‌పేట, 3వ వార్డు రాజీవ్‌గాంధీకాలనీ, రెల్లీకాలనీ, రైలుపేట తదితర ప్రాంతాలలో శుక్రవారం నరేంద్రవర్మ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎండను సైతం పట్టించుకోకుండా నాయకులు, కార్యకర్తలు ఆయనను అనుసరిస్తూ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. పూలుజల్లుతూ బ్రహ్మరథం పట్టారు. పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా నరేంద్రవర్మ మాట్లాడుతూ మహిళా సాధికారతే ధ్యేయంగా మహాశక్తి పథకాన్ని చేపట్టనున్నట్లు వివరించారు. స్థానికంగా తాగునీరు, పారిశుధ్యం, వీధిలైట్లు, డ్రైనేజి సమస్యల పరిష్కారానికి శక్తి వంచనలేకుండా పని చేస్తానన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగ కల్పనపై దృష్టిసారిస్తామన్నారు. సంకీర్ణ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రతిసమస్యను పరిష్కరించటంతోపాటు యువత భవిష్యత్తుకు బంగారుబాటలు వేస్తామన్నారు. ఎన్డీయే రూపొందించిన మేనిఫెస్టోతోపాటు స్థానికంగా తాను ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తానని హామినిచ్చారు. తనతోపాటు ఎంపీ అభ్యర్థి తెన్నేటి కృష్ణప్రసాద్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ సమన్వయకర్త నామన వెంకటశివన్నారాయణ, మున్సిపల్ మాజీ చైర్మన్ నరాలశెట్టి ప్రకాశరావు, పట్టణ పార్టీ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, మాజీ అధ్యక్షుడు వడ్లమూడి వెంకటేశ్వరరావు, పరీద్‌మస్తాన్, షాకా, తాతా చినబాబు, ఎంపీ అభ్యర్థి తెన్నేటి కృష్ణప్రసాద్ కుమార్తె తెన్నేటి రష్మి, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు చెన్నుపాటి హైమావతి, పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పల్లం సరోజినీ, మండల పార్టీ మహిళా అధ్యక్షురాలు కాగిత నాగభూషణమ్మ, కూచిపూడి ఝాన్సీరాణి, దగ్గుమల్లి రాణి, షేక్ నజ్మా, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారంలో ప్రజలకు అభివాదం చేస్తూ ఓట్లు అభ్యర్థిస్తున్న నరేంద్రవర్మ

సూర్యలంక, ఆదర్శనగర్, రామ్‌నగర్, ముత్తాయపాలెంలలో...



ముత్తాయపాలెంలో నరేంద్రవర్మకు హారతులతో స్వాగతం పలుకుతున్న మహిళ

బాపట్ల రూరల్, మే 3 మండలంలో బాపట్ల నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ శుక్రవారం విస్తృత ప్రచారాన్ని నిర్వహించారు. మహిళలు హారతులిస్తూ ఘనస్వాగతం పలికారు. సూర్యలంక, ఆదర్శనగర్, రామ్‌నగర్, ముత్తాయపాలెం గ్రామాలలో ఎన్నికల ప్రచారాన్ని నరేంద్రవర్మ నిర్వహిస్తూ సూపర్‌సిక్స్ పథకాల ద్వారా మహిళా సాధికారితే ధ్యేయంగా మహాశక్తి పేరిట తమ ప్రభుత్వం మహిళాభివృద్ధికి చేపట్టబోయే కార్యాచరణ గురించి వివరించారు. స్థానిక సమస్యలపై ఆయన మాట్లాడుతూ తాగునీరు, వీధిలైట్లు, మురికికాల్వల ప్రక్షాళన, దోమలనివారణ మొదలగు సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా పని చేస్తానన్నారు. నిరుద్యోగయువతకు ఉద్యోగ ఉపాధి కల్పన విషయంలో ప్రత్యేక దృష్టి సారిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, బాపట్ల జనసేన నియోజకవర్గ సమన్వయకర్త శ్రీమన్నారాయణ, టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్‌దారులకు వెంటనే డబ్బులు చెల్లించండి : డీఆర్‌డీఏ పీడీ

కర్లపాలెం, మే 3 : మండలంలోని పెన్షన్‌దారులందరికి వెంటనే డబ్బులు చెల్లించమని డీఆర్‌డీఏ పీడీ వై.పిచ్చిరెడ్డి యూనియన్‌బ్యాంక్ సిబ్బందికి శుక్రవారం సూచించారు. యూనియన్‌బ్యాంక్‌ను పిచ్చిరెడ్డి ఏపీఎం శ్రీనివాసరెడ్డితో కలిసి సందర్శించారు. పెన్షన్‌దారుల దీర్ఘకాలంగా వినియోగంలో లేని ఖాతాలను వెంటనే యాక్టివ్ చేసి పెన్షన్ అమౌంట్‌ను వెంటనే డ్రా చేసుకునే విధంగా వెంటనే చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు.

గణపవరంలో మోడల్ పోలింగ్‌స్టేషన్ పరిశీలన

కర్లపాలెం, మే 3 : మండలంలోని గణపవరంలో ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ స్టేషన్‌ను డీఆర్‌డీఏ పీడీ, స్వీప్ నోడల్ అధికారి వై.పిచ్చిరెడ్డి శుక్రవారం సందర్శించారు. వీరి వెంట పీడబ్ల్యూడీ నోడల్ అధికారి గుణశీల, అసిస్టెంట్ నోడల్ ఆఫీసర్ వెంకట్రావు, ఏపీఎం ఎన్.శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ సోమరాజును సత్కరించిన డీఎస్పీ

బాపట్లరూరల్, మే 3 : బాపట్ల డిఎస్పీ కార్యాలయంలో కానిస్టేబుల్‌గా పనిచేస్తూ డీజీపీ కమాండేషన్ డిస్క్ అవార్డు పొందినందుకు శుక్రవారం కానిస్టేబుల్ డి.సోమరాజును దుశ్శాలువాలతో డీఎస్పీ మురళీకృష్ణ సత్కరించి అభినందించారు. డీఎస్పీ పర్సనల్ ఇన్వెస్టిగేషన్ కేసులు దర్యాప్తు చేయటంలో సహాయకుడిగా ఉంటూ 2020 సంవత్సరంలో పెదనందిపాడు పోలీసుస్టేషన్ పరిధిలో జరిగిన రేప్ అండ్ ఫోక్సో కేసులో నిందితుడిని అరెస్ట్ చేయటలో, జీవితఖైదీ పడటంలో తనవంతు కృషి చేసినందుకు కానిస్టేబుల్ సోమరాజుకు ఈ అవార్డు వచ్చిందని డీఎస్పీ తెలిపారు.



చెరుకుపల్లిలో ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్‌కు హారతులు ఇస్తున్న మహిళలు

'సూపర్ సిక్స్'తో మహిళల జీవితాల్లో వెలుగులు

● రానున్నది ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వమే

● ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్

రేపల్లె, మే 3: మహిళల జీవితాల్లో వెలుగులు నింపేందుకు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సూపర్ సిక్స్ పథకాల ను ప్రవేశపెట్టారని ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ అన్నారు. శుక్రవారం చెరుకుపల్లి చెన్నకేశవనగర్ కస్తూరివారిపేట, ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. మహిళలు హారతులు ఇస్తూ స్వాగతం పలికారు. అన్న మూడోసారి విజయం నీది అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మహిళ ఎన్‌డీఏ కూటమిని ఆశీర్వదించాలని కోరారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణంతో పాటు దీపం పథకం క్రింద ఏడాదికి మూడు గ్యాస్ సిలెండర్లు ఉచితం వంటి పథకాలతో మహిళలకు అండగా నిలుస్తామన్నారు. వైసీపీ ప్రభుత్వం ఒక్క చేత్తో రూ.10లు ఇచ్చి మరోక చేతితో రూ.100లు లాగేసుకుంటున్న విషయాన్ని ప్రతిఒక్కరూ గమనించాలన్నారు. రాష్ట్రంలో జగన్ పాలనలో కరం టు, బస్సు, పెట్రోల్, డీజిల్, నిత్యావసర వస్తువులు విపరీతంగా పెరిగిపోయి సామాన్యుడిపై అధిక భారం మోపారన్నారు. మద్య నిషేధం గాలికి వదిలేసి సొంతంగా మద్యం వ్యాపారం చేస్తూ నాసిరకం మద్యంతో పేదల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న వైసీపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలన్నారు. తీరప్రాంతాన్ని అభివృద్ధి చేసే విధంగా కృషి చేస్తానని మీరంతా నాకు అండగా నిలిచి నా గెలుపునకు కృషి చేయాలని కోరారు. చెరుకుపల్లిలో రహదారులు, తాగునీరు, డ్రైయినేజీల సమస్యలను పరిష్కరిస్తానని తెలిపారు. రైతులకు చివరి భూముల వరకు సాగునీరు అందించే విధంగా చర్యలు చేపడతామని అన్నారు. పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించి రైతులు నేరుగా అమ్ముకునే విధంగా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మల్లాది రామకృ ష్ణ, మొఖమాటం రాదాకృష్ణమూర్తి, పూషడపు కుమారస్వామి, పిట్టు శ్రీనివాస్‌రెడ్డి, కందుల వెంకటేశ్వరరావు, శొంఠి కోటయ్య, మండవ తాతాజీ, ఉప్పాల సాంబశివరావు, గూడపాటి శ్రీను, తాతా ఏడుకొండలు, కేసన రామకృష్ణ, కొలసాని రాము తదితరు లు పాల్గొన్నారు.



గుడ్డికాయలంకకు చెందిన వైసీపీ నాయకులు, వలంటీర్లకు టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్

వైసీపీ నాయకులు, వలంటీర్లు టీడీపీలో చేరిక

రేపల్లె, మే 3: వైసీపీ చేస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు విసి గిపోయి వైసీపీ నాయకులు, వలంటీర్లు టీడీపీలో భారీగా చేరుతున్నారు. శుక్రవారం ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ సమక్షంలో గుడ్డికాయలంక గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు పరిశా రాజు, మోర్ల రమేష్, వలంటీర్లు కేసన రత్నరాజు, పేరం గోపి, కేసన శివయ్య, నిజాంపట్నం గ్రామానికి చెందిన అగ్నికుల క్షత్రియసంఘ నాయకులు నరసింహమూర్తి, కొత్తపాలేనికి చెందిన చిప్పల భగవంతరావు, కొల్లాటి మునేశ్వరరావు, వాటుపల్లి గోపి, శివనాగరాజు, మోపిదేవి శ్రీను, కె.గోపిలకు టీడీపీ కం డువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పదిరోజుల పాటు కష్టపడి పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని మీ అభివృద్ధిని నేను చూసుకుంటానని అనగాని హామీనిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పంతాని మురళీధరరావు, బాపట్ల జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి తాతా ఏడుకొండలు, దండుప్రోలు వెంకటేశ్వరరావు, పంతాని సాయికుమార్, యేమినేని బుల్లిబాబు, కొక్కిలిగడ్డ అర్జున్‌రావు, యార్లగడ్డ శ్రీనివాసరావు, యరగాళ్ళ వీరయ్య, దాసరి మునిసుబ్బారావుపాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ దైవ కార్యక్రమాల్లో పాల్గొనాలి : అనగాని

చెరుకుపల్లి, మే 3: ప్రతి ఒక్కరూ దైవ కార్యక్రమాల్లో పాల్గొని పూజలు చేస్తే గ్రామాలు పాడిపంటలతో తులతూగుతాయని ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ అన్నారు. శుక్రవారం వీరరాఘవపేటలోని శ్రీషిర్డిసాయిబాబా మందిర 28వ వార్షిక వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ దైవ కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు. అనంతరం అన్న సంతర్పణలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు రావూరి ఆంజనేయులు, దివి రాంబాబు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జగన్ మేనిఫెస్టోను ప్రజలు నమ్మే పరిస్థితి లేదు


● నిజాంపట్నం అభివృద్ధి అనగానితోనే సాధ్యం



జల్లాబజార్‌లో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సోదరి డాక్టర్ కమల

రేపల్లె, మే 3: ప్రజలను మరోమారు మోసం చేసేందుకు జగన్ సర్కార్ సిద్ధమైందని వైసీపీ ప్రవేశపెట్టిన మేనిఫెస్టోను ప్రజలు ఎవరూ నమ్మే పరిస్థితిలో లేరని ఎమ్మెల్యే సోదరి డాక్టర్ అనగాని కమల అన్నారు. శుక్రవారం నిజాంపట్నం జల్లా బజార్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2019లో జగన్‌రెడ్డి ప్రకటించిన మేనిఫెస్టోలో మద్యపాన నిషేధం చేస్తానని, యువతకు ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేస్తానని, మరెన్నో హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేశారన్నారు. టీడీపీ ప్రభుత్వ కూటమి అధికారంలోకి రాగా నే మొదటి సంతకం డీఎస్సీ నోటిఫికేషన్ మీదే చేయనున్నట్లు తెలిపారు. మత్స్యకారుల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని నిజాంపట్నంలో నెలకొన్న రహదారులు, తాగునీరు, డ్రైయినేజీ సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నర్రా సుబ్బ య్య, బొమ్మిడి రామకృష్ణ, కేసన వాసు, దండమూడి ధరణికుమా ర్, పి.లక్ష్మీకాంతం, వర్ధిని, కవితా సాగర్, తుమ్మల విజయశాంతి, హైమా, శివ తదితరులు పాల్గొన్నారు.

ఈపూరులో ఆనందబాబు తనయుడు ప్రచారం



ప్రచారంలో ఆనందబాబు తనయుడు డాక్టర్ అఖిలేష్‌తో మహిళలు

కొల్లూరు, మే 3 : కూటమి అభ్యర్థి నక్కా ఆనందబాబు తనయుడు డాక్టర్ అఖిలేష్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. శుక్రవారం మండలపరిధిలోని ఈపూరులో కూటమి అభ్యర్థి ఆనందబాబు విజయం కోరుతూ ఆయన తనయుడు గ్రామంలో ఇంటిం టికి పర్యటించి బాబు సూపర్‌సిక్స్ కరపత్రాలను పంపిణీ చేస్తూ ఓట్లు అభ్యర్థించారు. టీడీపీ హయాంలో తన తండ్రి చేసిన అభి వృద్ధి పనుల గురించి ప్రజలకు వివరిస్తూ ఈ నెల 13వ తేదీన జరిగే సార్వత్రిక ఎన్నికల్లో అసెంబ్లీ అభ్యర్థి ఆనందబాబును, పార్లమెంట్ అభ్యర్థి తెన్నేటి కృష్ణప్రసాద్‌లను గెలిపించాలని కోరా రు. కార్యక్రమంలో గ్రామ టీడీపీ నాయకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

బాపట్ల, మే 3 : యువతి అదృశ్యంపై బాపట్ల పట్టణ పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పట్టణ సీఐ యు.శ్రీనివాసులు తెలిపిన వివరాలు ప్రకారం బాపట్ల పట్టణ శారదాపురి కాలనీకి చెందిన రావూరి యశోద గత నెల 21వ తేదీన ఇళ్ళల్లో పని చేయటానికి వెళ్ళి తిరిగి రాలేదని ఆమె తల్లి నాగమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

జన కేతనం
ఆంధ్రజ్యోతి
8
బాపట్ల జిల్లా వార్తలు
శనివారం 4 మే 2024


సమావేశంలో మాట్లాడుతున్న పరిమళసింగ్, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్‌బాషా, ఎస్పీ వకుల్ జిందాల్ తదితరులు

సమస్యాత్మకం.. సవాలే

- నాలుగో వంతుకు పైగా సమస్యాత్మక కేంద్రాలు
- యంత్రాంగానికి సవాల్‌గా మారిన ఎన్నికలు
- ముందస్తు చర్యలతోనే సాఫీగా ప్రక్రియ

జిల్లాలో ఈసారి పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేనా అన్న అనుమానాలు ఓటర్లలో వ్యక్తమవుతోంది. అటు రాష్ట్రంలో అరాచక పాలన, ఇటు జిల్లాలో అధికార పార్టీ వ్యవహరించిన తీరు.. తాజాగా జిల్లాలో జరిగిన అరాచక ఘటనలతో ప్రజానీకం మరింత ఆందోళన చెందుతోంది. జిల్లాలో పోలింగ్ కేంద్రాల్లో నాలుగోవంతుకు పైగా సమస్యాత్మక మైనవిగా ఎన్నికల యంత్రాంగం గుర్తించింది. ఈ నేపథ్యంలో 13న జనగనున్న పోలింగ్ శాంతియుత వాతావరణంలో నిర్వహించడం జిల్లా యంత్రాంగానికి కత్తిమీద సాములాగే కనిపిస్తోంది. అటు పోలీసులు ఇటు అధికార యంత్రాంగం అప్రమత్తంగా వ్యవహరిస్తేనే ఈ సమస్యను అధిగమించే అవకాశం ఉంది.

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

జిల్లాలో ఎక్కువ సంఖ్యలో పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మకమైనవిగా గుర్తించారు దీంతో యంత్రాంగానికి ఎన్నికల నిర్వహణ సవాల్‌గా మారనుంది. ఈ నేపథ్యంలో ఎన్నికలు ఏ మేరకు సాఫీగా సాగుతాయన్న అనుమానం ప్రజల్లో వ్యక్తమవుతోంది. గతంలో ఎన్నికల ముందు ఆ తర్వాత పోలింగ్ రోజున వివిధ ఘటనలు చోటుచేసుకున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార పార్టీ ప్రతిపక్ష పార్టీల అభ్యర్థుల నామినేషన్‌లు కూడా వెయ్యనీయలేదు. అభ్యర్థులపై దాడులు, నామినేషన్ పత్రాల చించివేత వంటి ఘటనలు పోలీసుల కళ్లముంతే జరిగినా వారు ప్రేక్షకపాత్ర వహించారు. ఈ ఘటనలను గుర్తు తెచ్చుకుంటున్న ఓటర్లు ప్రశాంత ఎన్నికలు నిర్వహిస్తారా అన్న అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు.

29 శాతం కేంద్రాలు సమస్యాత్మకం

జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 17,34,858 మంది ఓటర్లు ఉన్నారు. 1026 లొకేషన్‌లలో 1,926 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. వీటిలో 557 కేంద్రాలను సమస్యాత్మకమైనవిగా గుర్తించారు. అత్యధికంగా గురజాల నియోజకవర్గంలో 304 పోలింగ్ కేంద్రాలు ఉంటే 57 శాతానికి పైగా అంటే 174 పోలింగ్ కేంద్రాలు సమస్యాత్మకమైనవి. దాదాపు ఇదే పరిస్థితి మాచర్ల నియోజకవర్గంలో కూడా ఉంది. మాచర్ల సెగ్మెంట్‌లో 299 పోలింగ్ కేంద్రాలకు గాను 50శాతంకు పైగా 151 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మకంగా గుర్తించారు. గతంలో జరిగిన ఎన్నికల సందర్భంగా ఘర్షణలు జరగడం, ఒకే పార్టీ అభ్యర్థికి 75 శాతానికి పైగా ఓట్లు వచ్చినవి, ఒక వర్గం వారిని పోలింగ్‌కు రాకుండా అడ్డుకున్న పరిస్థితులు, ప్రత్యేకించి దళిత ఓటర్లకు ఆటంకం కలిగించే ఘటనలు చోటు చేసుకుంటే ఆ కేంద్రాలను సమస్యాత్మకంగా గుర్తించారు. అలాగే మాచర్ల, గురజాల నియోజకవర్గాల్లో ఎన్నికల కోడ్ అమల్లో వచ్చిన తర్వాత కూడా అనేక అరాచక ఘటనలు చోటుచేసుకున్నాయి. వీటిలోనే ఎక్కువగా సమస్యాత్మక కేంద్రాలు ఉండటం ఓటర్లను ఆందోళనకు గురిచేస్తోంది.

సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. పటిష్ఠ బందోబస్తు ఇతర చర్యలతో స్వేచ్ఛగా ప్రశాతంగా ఓటర్లు పోలింగ్‌లో పాల్గొనేలా యంత్రాంగం చర్యలు తీసుకోవాలి. ఇందులో పోలీసు పాత్ర అత్యంత కీలకం అయితే ప్రస్తుత పరిస్థితులు యంత్రాంగం, అధికార పార్టీ తీరుపై టీడీపీ అభ్యర్థుల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికల నిర్వహణ యంత్రాంగం మరింత అప్రమత్తంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. సాధారణ బందోబస్తు కాకుండా అదనపు బలగాల నియామకం, ముందస్తుగా నిఘా పెంపు, వివాదాలు పెంచే వ్యక్తుల గుర్తింపు, వీరి కదలికల నియంత్రణ, పోలింగ్ కేంద్రాలలో మైక్రో అబ్జర్వర్ల నియామయం, వీడియోగ్రఫీ, వెబ్ కాస్టింగ్ వంటి చర్యలు తీసుకోవాలి. వీటికి విస్తృత ప్రచారం కల్పించి ఓటర్లకు భరోసా కలిగించాల్సిన అవసరం ఉంది. జిల్లా ఎస్పీ బిందు మాధవ్ సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించారు. ఆయా గ్రామాల్లో పర్యటిస్తూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహిస్తామన్న భరోసా కల్పిస్తున్నారు. పోలీసు కవాతు నిర్వహిస్తున్నారు. పోలీసు శాఖ తీసుకుంటున్న ముందస్తు చర్యలు ఎటువంటి ఫలితాలను ఇస్తాయో చూడాలి.


పెదకూరపాడు మండలం గారపాడు గ్రామస్తులతో ఎస్పీ బిందు మాధవ్

నియోజకవర్గం	మొత్తం పోలింగ్ కేంద్రాలు	సమస్యాత్మక కేంద్రాలు
పెదకూరపాడు	266	44
చిలకలూరిపేట	239	32
నరసరావుపేట	245	70
సత్తెనపల్లి	274	27
వినుకొండ	299	59
గురజాల	304	174
మాచర్ల	299	151
మొత్తం	1926	557

ఆ నాలుగు నియోజకవర్గాలు సమస్యాత్మకం

- గుర్తించిన ఎన్నికల కమిషన్

నరసరావుపేట, మే 3: జిల్లాలో అరాచకాలు, దౌర్జన్యాలపై ఎన్నికల కమిషన్ దృష్టి సారించింది. ఆ నాలుగు నియోజకవర్గాలను సమస్యాత్మకంగా ప్రకటించింది. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన అనంతరం జరిగిన దాడులు, అరాచకాల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆ నియోజకవర్గాలపై చర్యలు తీసుకుంది. మాచర్ల, గురజాల, వినుకొండ, పెదకూరపాడు నియోజకవర్గాల్లో ఎన్నికల నిర్వహణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారిని ఆదేశించింది. పెదకూరపాడులో 266 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. వినుకొండలో 299, గురజాలలో 304, మాచర్లలో 299 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఈ నియోజకవర్గాల్లో మొత్తం 1,168 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అయా నియోజకవర్గాల్లోని అన్ని పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్ నిర్వహించాలని ఆదేశించింది. సీఆర్‌పీఎఫ్‌తో బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించింది. ఎన్నికల కమిషన్ ఆదేశాలను టీడీపీ కూటమి నేతలు స్వాగతించగా వైసీపీ నేతలకు మింగుడు పడనిదిగా ఉంది.

ప్రశాంత ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

- ఎన్నికల సాధారణ పరిశీలకులు పరిమళసింగ్

బాపట్ల, మే 3: జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఎన్నికల సాధారణ పరిశీలకులు పరిమళసింగ్ తెలిపారు. ఢిల్లీ నుంచి భారత ఉప ఎన్నికల కమిషనర్ నితీష్ వియాస్ శుక్రవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో బాపట్ల కలెక్టరేట్ నుంచి ఆయన జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్‌బాషా, ఎస్పీ వకుల్‌జిందాల్ తదితరులతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిర్వాహణ, ఏర్పాట్లపై పలుమార్లు సమీక్షించామన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలకు సూక్ష్మ పరిశీలకులను నియమించామని, వారికి శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఓటరు స్లిప్‌ల పంపిణీ సజావుగా సాగుతుందన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు సాధారణ పరిశీలకులు ఖాజన్‌సింగ్ తెలిపారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నట్లు రంజిత్‌బాషా తెలిపారు. అభ్యర్థుల సమక్షంలోనే పోలింగ్ యంత్రాల రెండో దశ ర్యాండమైజేషన్ నిర్వహించామన్నారు. హోం ఓటింగ్ 5 నుంచి 8 వరకు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో 68 శాతం వీడియోగ్రఫి ఏర్పాటు చేశామన్నారు. వకుల్‌జిందాల్ మాట్లాడుతూ ఇప్పటి వరకు 4.87 కోట్ల విలువ చేసే మద్యం, ఆభరణాలు, బహుమతులు, నగదు సీజ్ చేశామన్నారు. అల్లర్లకి అవకాశం ఉన్న ప్రాంతాల్లో మరింత బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు. సమావేశంలో జిల్లా పరిశీలకులు కెప్టెన్ అయ్యప్ప, అరుణ్‌కుమార్, స్వప్నిల్‌సాహేబ్‌రావు, కన్నయ్యపద్దార్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ ఓటు ఇలా..

గుంటూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఎన్నికల్లోనూ పోస్టల్ బ్యాలెట్ ఓట్లు ఎక్కువ సంఖ్యలో ఇన్‌వ్యాలిడ్ అవుతున్నాయి. ఇందుకు ప్రధాన కారణం నిబంధనలు సరిగా పాటించకపోవడమే. గత ఎన్నికల్లో ఏకంగా 9,500 వరకు పోస్టల్ బ్యాలెట్ ఓట్లు ఇన్‌వ్యాలిడ్ అయ్యాయంటే పరిస్థితి ఎలా ఉందో ఊహించవచ్చు. ఉద్యోగులు ఎన్నో సంవత్సరాలుగా పోస్టల్ బ్యాలెట్ ఓట్లు వేస్తూ వస్తున్నారు. అయినా ఎక్కడో ఒక చోట తడబడి తమ ఓటుని సరిగా వేయలేకపోతున్నారు. గతంలో పోస్టల్ బ్యాలెట్‌లను రాజకీయ పార్టీలు కొనుగోలు చేసేవి. ఆ విధానానికి ఎన్నికల సంఘం స్వస్తి చెప్పి ఫెసిలిటేషన్ సెంటర్లు ఏర్పాటు చేసి అక్కడే ఓటు వేసేలా నిబంధన తీసుకొచ్చింది. ఈ నెల 5, 6, 7, 8 తేదీల్లో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ జరగనుంది. పోస్టల్ బ్యాలెట్‌లో 13ఏ(ఫారం-ఏ) డిక్లరేషన్, 13బీ(ఫారం-బీ) చిన్న ఎన్‌వెలప్ కవర్, 13సీ(ఫారంసీ) పెద్ద ఎన్‌వెలప్ కవర్, బ్యాలెట్ పేపర్-13డీలను చూసి అయోమయానికి గురికాకుండా ఓటు వేయడం ఎంతో సులభతరమని ఎన్నికల నిపుణులు సూచిస్తున్నారు.

- 13ఏ(ఫారం-ఏ) ఇది కాగితం రూపంలో ఉంటుంది. దీని మీద ఓటరు వివరాలు ఉంటాయి. ఈ పేపర్ పైనే గజిటెడ్ అధికారి సంతకం చేయించాలి. గజిటెడ్ అధికారులు ఫెసిలిటేషన్ సెంటర్‌లోనే అందుబాటులో ఉంటారు.
- 13బీ(ఫారం-బీ) ఇది చిన్న ఎన్‌వెలప్ కవర్. దీని మీద బ్యాలెట్ పేపర్ సీరియల్ రాసి ఉంటుంది. ఒకవేళ సీరియల్ లేకపోతే ఆ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లాలి. బ్యాలెట్ పేపర్ మీద ఎవరికైతే ఓటు వేయదలిచారో ఆ అభ్యర్థి పేరుకు ఎదురుగా ఉండే గడిలో రైట్ టిక్ మార్కు చేయాలి. బ్యాలెట్ పేపర్‌ని ఆ చిన్న కవర్‌లో పెట్టి సీలు వేయాలి.
- 13సీ(ఫారం-సీ) ఇది పెద్ద ఎన్‌వెలప్ కవర్. దీని మీద ఓటరు సంతకం చేయాలి. అసెంబ్లీ/పార్లమెంట్ ఏది అయితే అది రాయాలి.
- డిక్లరేషన్ ఫారం, బ్యాలెట్ పేపర్ పెట్టి సీలు చేసిన ఫారం-బీ రెండిటిని పెద్దకవర్ ఫారం-సీలో పెట్టి సీలు చేసి ఫెసిలిటేషన్ సెంటర్‌లో ఉండే బాక్సులో వేయాలి. ఏమైనా అనుమానాలుంటే అక్కడ అందుబాటులో ఉండే పీవో/ఏపీవోలని సంప్రదించొచ్చు.

టీడీపీ కట్టింది.. వైసీపీ వదిలేసింది

- రూ.60 లక్షల రైతుబజారు శిథిలం
- మద్యం బాబులకు అడ్డాగా ప్రాంగణం

బాపట్ల, ఏప్రిల్ 19: వినియోగదారులకు తక్కువ ధరకు నాణ్యమైన కూరగాయల కొనుగోలుకు.. బాపట్ల పరిసరాల్లోని కూరగాయల రైతుల కోసం.. 2019లో నిర్మించిన రైతుబజారు ఐదేళ్లుగా ప్రారంభానికి నోచుకోలేదు. వ్యవసాయ మార్కెట్‌యార్డు నిధులు రూ.60 లక్షలు వెచ్చించి టీడీపీ హయాంలో అప్పటి టీడీపీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్ ఆధ్వర్యంలో రైతుబజారును నిర్మించారు. 56 షాపులు ఏర్పాటు చేసి వ్యాపారులకు, కొనుగోలుదారులకు అవసరమైన సౌకర్యాలు కల్పించారు. పనులు పూర్తి చేయగా ఇక ప్రారంభోత్సవమే మిగిలింది. ఎన్నికలు రావడం ప్రభుత్వం మారింది. దీంతో అప్పటి నుంచి ఇప్పటి వరకు ఈ రైతుబజారును వైసీపీ పాలకులు పట్టించుకోలేదు. దీంతో రైతుబజారు శిథిలావస్థకు చేరింది. కేవలం తెలుగుదేశం ప్రభుత్వహయాంలో నిర్మించిన కారణంగానే దీనిని నిర్లక్ష్యం చేస్తున్నారన్న విమర్శలు పట్టణవాసుల నుంచి వస్తున్నాయి. రైతుల కోసం ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్ తుప్పుపట్టి పనికిరాకుండా పోతున్నది. మార్కెట్ సమీపంలో ప్రభుత్వ మద్యం దుకాణం ఉండటంతో యువకులు మద్యం తెచ్చుకుని ఈ ప్రాంతంలో కూర్చొని పట్టపగలు కూడా తాగుతుంటారు. రైతుబజారు మందుబాబులకు అడ్డాగా మారినా అధికారులు చోద్యం చూస్తున్నారు. కూరగాయల మార్కెట్‌లోని బడా వ్యాపారులు రైతుబజారు ప్రారంభమైతే తమకు వ్యాపారం తగ్గుతుందనే భయంతో దానిని ప్రారంభించకుండా అడ్డుకుంటున్నారు. అందుకు అధికారులు, వైసీపీ ప్రజాప్రతినిధులు సహకరిస్తున్నారన్న విమర్శలు కూడా ఉన్నాయి.


బాపట్ల కూరగాయల మార్కెట్ సమీపంలో వ్యవసాయ మార్కెట్‌యార్డు రూ.60 లక్షలతో నిర్మించిన రైతుబజారు


రైతుబజారులో ఏర్పాటుచేసిన మినరల్ వాటర్‌ప్లాంట్ తుప్పు పడుతున్న దృశ్యం

కరకట్టపై కనికరించలేదు

- కనీస మరమ్మతుల దాఖలాలూ లేవు
- పటిష్టతపై ఐదేళ్లుగా పట్టించుకోని ప్రభుత్వం
- కోతలతో ప్రమాదకరంగా మారినా పాలకుల నిర్లక్ష్యం

రేపల్లె, మే 3: కృష్ణమ్మ జనావాసాల్లోకి రాకుండా కట్టడి చేసే కరకట్టపై వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లుగా కనికరించలేదు. గోతులు, కోతలతో ప్రమాదకరంగా మారినా పట్టించుకోలేదు. వైసీపీ అధికారంలోకి వచ్చి ఐదేళ్లలో కరకట్టపై కనీసంగా కూడా దృష్టి సారించని దాఖలాలు లేవు. కరకట్ట ఎక్కడికక్కడ కోతలతో, ఇసుక వాహనాల రాకపోకలతో భారీ గుంతలు పడి బీటలు వాలి ప్రమాద భరితంగా మారింది. ఏ యేడుకా ఏడాది కరకట్టలు అభివృద్ధి చేస్తామంటూ వరదల సమయంలో అధికారులు హడావుడికే పరిమితమవుతున్నారు. జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కరకట్టకు కనీస మరమ్మత్తులు నిర్వహించిన దాఖలాలు లేవు. కృష్ణానది వెంబడి పదుల సంఖ్యలో ఇసుక రీచ్‌లు ఉండటంతో 20 చక్రాల టిప్పర్లు, భారీ లారీలు, ట్రాక్టర్లు ఇసుక లోడ్‌తో కరకట్ట వెంబడి రాకపోకలు సాగిస్తుండటంతో కరకట్ట అధ్వానంగా తయారైంది. ఆర్‌సీ అధికారులు ఇసుక లారీల వద్ద మామూళ్లు వసూలు చేస్తున్నారే తప్ప కరకట్ట మరమ్మతుల గురించి ఆలోచించిన దాఖలాలు లేవు.

ఆవేదనను ఆలకించడంలేదు

ఇరువైపులా ముళ్లచెట్లతో, భారీగా గోతులతో ప్రమాదకరంగా ఉన్న కరకట్టను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని కట్ట వెంబడి ఉన్న గ్రామీణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో భట్టిప్రోలు, రేపల్లె మండలాల్లో ప్రమాదభరితంగా మారిందంటున్నారు. కరకట్ట వెంబడి పెట్రోలింగ్ నిర్వహించాల్సిన ఆర్‌సీ అధికారులు కన్నెత్తి కూడా చూసిన దాఖలాలు లేవంటున్నారు. గతంలో ఓలేరు పల్లెపాలెం సమీపంలో కట్టకు గండి పడి వేలాది ఎకరాల పంట దెబ్బతినడంతో పాటు కోట్లాది రూపాయలు నష్టం వాటిల్లింది. అయినా అధికారులకు చీమ కుట్టినట్లు కూడా లేదని రైతులు మండిపడుతున్నారు. భట్టిప్రోలు, రేపల్లె మండలాల పరిధిలో సుమారు 40 కీమీ మేర కరకట్ట వెంబడి 30 గ్రామాలున్నాయి. భట్టిప్రోలు మండలం వెల్లటూరు సమీపంలో కరకట్ట మోకాలు లోతు గోతులతో ప్రమాదభరితంగా మారింది. పెదపులివర్రు, ఓలేరు మధ్యలో భారీగా బీటలువాలింది. రేపల్లె మండలం రావి అనంతవరం, పెనుమూడి వద్ద భారీవాహనాల కారణంగా రోడ్డు ఛిద్రమై పోయింది. రుద్రవరం, మైనేనివారిపాలెం, మోర్తోట, ప్రాంతాల్లో కోతలకు గురై మట్టికొట్టుకుపోయింది. కనగాలవారిపాలెం సమీపంలో మైనేనివారిపాలెం, పిరాట్లంక సమీపంలో కరకట్టకు పైప్‌లు వేసి ఇంజన్ల ఏర్పాటు చేయడంతో ప్రమాదకరంగా మారింది. గంగడిపాలెం, రాజుకాల్వ, లక్ష్మీపురం, లంకేవానిదిబ్బ, సమీపంలో కరకట్ట కోతలకు గురైంది. లక్ష్మీపురం నుంచి లంకేవానిదిబ్బ వరకు కృష్ణానది ఆనుకుని రొయ్యల సాగుతో కరకట్ట బాటగా మారింది. వరదల సమయంలో ఇసుక బస్తాలు వేసి ఆ రెండు మూడు రోజులు హడావుడి చేస్తున్నారే కాని కరకట్టను బలపరిచిన దాఖలాలు లేవు. కొన్ని ప్రాంతాల్లో ఎక్కడికక్కడ గాడులు పడి కోతలకు గురై ప్రమాదభరితంగా మారింది. వర్షాకాలంలో కోతలకు గురౌవుతున్న కరకట్టను వేసవిలో బాగు చేస్తామని పాలకులు, అధికారులు ప్రకటనలు చేస్తున్నారే తప్ప ఆచరణలో సాధ్యమైన దాఖలాలులేవు.


చెన్నుపల్లివారిపాలెం సమీపంలో కోసుకుపోయిన కరకట్ట


రుద్రవరం సమీపంలో కరకట్ట పూడుకుపోయి గోతులమయం ఇరుపక్కల ముళ్ళచెట్లతో కాలిబాటగా తయారైన కరకట్ట


పెనుమూడి వారధి సమీపంలో కోతలకు గురైన కరకట్ట


కనగాలవారిపాలెం సమీపంలో కరకట్టకు అమర్చిన పైపులైన్లు, మోటార్లు


పెదపులివర్రు సమీపంలో బీటలు వారిన కరకట్ట


మైనేనివారిపాలెం సమీపంలో కోతకు గురైన కరకట్ట


కొల్లూరు వద్ద ప్రమాదకరంగా రాకపోకలు

అమెరికా నుంచి వస్తున్నా...

- అమరావతికి మద్దతుగా ఓటు వేస్తా...

మేడికొండూరు, మే 3: గుంటూరు జిల్లా తాడికొండ నియోజకవర్గం మేడికొండూరుకు చెందిన కాటా హర్షిత 9 నెలల క్రితం ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లారు. అయితే ఈ నెల 13 వ తేదీన ఏపీలో జరుగుతున్న ఎన్నికల్లో ఓటు వేసేందుకు ఆమె అమెరికాలోని డల్లాస్ నుంచి బయలు దేరి మేడికొండూరుకు వస్తున్నట్టు ఆమె తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. వ్యయ, ప్రయాసలకు లోనై ఎందుకు వస్తున్నావని ఆమె తల్లిదండ్రులు ప్రశ్నించారు. తాను అమరావతి రాజధాని రైతుల ఆందోళనను చూశానని పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియ మొదలైన నాటి నుంచి అమరావతి రైతులు తాడికొండ నియోజక వర్గంలోని గ్రామాలలో ఇంటింటికి వెళ్లి రాజధానిని నిర్మించేవారికి ఓటు వేసి గెలిపించాలని వేడుకుంటున్న తీరు తనను కలచి వేసిందని చెప్పుకొచ్చారు. తన వంతు బాధ్యతగా రాజధాని ప్రాంత నియోజకవర్గమైన తాడికొండ పరిధిలో ఉన్న తన ఓటు హక్కును తొలిసారిగా వినియోగించుకొనేందుకు అమెరికా నుంచి బయలుదేరి వస్తున్నట్టు హర్షిత తన కుటుంబ సభ్యులకు తెలియజేసింది.


కాటా హర్షిత

ప్రజల జీవితాల్లో వెలుగులు నింపడమే లక్ష్యం

- మేనిఫెస్టోతో అన్నివర్గాలకు ఆర్థిక భరోసా
- టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఏలూరి
- వలపర్ల, తిమ్మరాజుపాలెంలో భారీగా చేరికలు

పర్చూరు, మే 3: ప్రజల జీవితాల్లో వెలుగులు నింపడమే లక్ష్యంగా తెలుగుదేశం, జనసేన, బీజేపీ ప్రజా కూటమి అద్భుతమైన మేనిఫెస్టోను రూపొందించిందని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఏలూరి సాంబశివరావు అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే ఏలూరి క్యాంప్ కార్యాలయంలో తిమ్మరాజుపాలెం నుంచి 20 కుటుంబాలు, వలపర్ల నుంచి పది కుటుంబాలు టీడీపీలో చేరారు. ఈసందర్భంగా ఏలూరి మాట్లాడుతూ ఆడబిడ్డ నిధి కింద ప్రతి మహిళకు రూ.1500 చొప్పున అందిస్తామన్నారు. అదేవిధంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు, అదేవిధంగా డ్వాక్రా సంఘాలకు రూ.10లక్షల వరకు సున్నా వడ్డీ అమలు చేస్తామని తెలిపారు. ప్రతి యువకునికి ఉద్యోగం కల్పించే విధంగా బాధ్యత తీసుకుంటామన్నారు. మెగా డీఎస్సీపై తొలిసంతకం చేస్తామని అదే విధంగా ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు నిరుద్యోగులకు కల్పించడమే కూటమి లక్ష్యమన్నారు. నిరుద్యోగులకు ప్రతినెలా రూ.3వేల భృతి ఇస్తామన్నారు. తొలుత పేద వృద్ధుల కోసం ఎన్టీఆర్ పెన్షన్ అమలు చేస్తే చంద్రబాబు రూ.2వేలకు పెంచారన్నారు. కూటమి ప్రభుత్వం రాగానే రూ.4వేల పింఛన్ అందిస్తామన్నారు. ప్రమాదంలో చనిపోయిన కుటుంబాలకు రూ.10లక్షల బీమా, బీసీ కార్పొరేషన్ ద్వారా 50శాతం సబ్సిడీపై రుణాలు టీడీపీ ఘనత అన్నారు. వేలాది మందికి విదేశీ విద్య అవకాశం కల్పించినది చంద్రబాబు అన్నారు. బీసీ యువతకు ఏపీ స్టడీ సర్కిల్, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ల ద్వారా శిక్షణ ఇప్పించి ఉపాధి కల్పించిన ఘనత టీడీపీదేనన్నారు. జగన్‌రెడ్డి వచ్చాక బీసీలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్‌లు తగ్గించి, రాజ్యాంగబద్ధ పదవులకు దూరం చేసిందన్నారు.


వలపర్లలో వైసీపీని వీడి టీడీపీలోకి చేరిన వారిని ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి

కూటమి విస్తృత ప్రచారం

టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యరి ఏలూరి గెలుపుకోసం నాయకులు, కార్యకర్తలు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. శుక్రవారం పర్చూరులో ఒకటో వార్డు, రెండోవార్డులో చేపట్టిన ఎన్నికల ప్రచారానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించింది. పెద్ద ఎత్తున మహిళలు, వృద్ధులు, యువకులు తరలి వచ్చి ఏలూరికి మద్దతుగా నిలిచి ప్రచారంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రజా కూటమి నాయకులు కొల్లా శివరాంప్రసాద్, కఠారి, సురేంద్రబాబు కోటగిరి ప్రసాద్, కొల్లా చౌదరి, కృష్ణంశెట్టి, జగదీష్, కూరపాటి జగన్, ఊటుకూరి నిర్మల, కొల్లా సుబ్బాయమ్మ, శివాలశెట్టి రమ, నార్ని మణి, బేత భూపతి, జనసైనికులు అచ్చికోలు సతీష్, కొసనా యశ్వంత్ పాల్గొన్నారు. అదేవిధంగా రెండో వార్డులో చేపట్టిన ఎన్నికల ప్రచారంలో కొండ్రగంటి శివనాగేశ్వరరావు, రంగిశెట్టి ఆంజనేయులు, తులసి అప్పారావు, రంగిశెట్టి రవికుమార్, సాంబయ్య, శ్రీరాం వెంకట సుబ్బారావు, రంగిశెట్టి రామాంజనేయులు పాల్గొన్నారు.


పర్చూరులో ప్రచారం నిర్వహిస్తున్న కూటమి శ్రేణులు

టీడీపీలో భారీగా చేరికలు

మార్టూరు మండలం వలపర్ల గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు ఎమ్మెల్యే ఏలూరి సమక్షంలో టీడీపీలో పార్టీలోకి చేరారు. వారిలో మురికి రాంబాబు, మురికి కిషోర్, బాబు, లాజర్, ఎలీషా, గంటెనపల్లి సుబ్బారాయులు, జయరాజు, బురగ అంకమ్మరావు ఉన్నారు. పర్చూరు మండల పరిధిలోని తిమ్మరాజుపాలెం గ్రామానికి చెందిన ఇంటూరి శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, బాలినేని నాగేశ్వరరావు, బాలనేని పోతురాజు, చింతలపాపారావు, మానం ఆంజనేయులు, మానం కృష్ణ, పుల్లారి రాజేష్ సైకిలెక్కారు.

కలిసికట్టుగా పనిచేయండి

ఇంకొల్లు : ఎన్నికలలో అందరూ కలిసి కట్టుగా పని చేసి టీడీపీ గెలుపునకు కృషి చేయాలని టీడీపీ మూటకి ఎమ్మెల్యే అభ్యర్థి ఏలూరి సాంబశివరావు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం మండలంలోని గంగవరం వచ్చిన సందర్భంగా గ్రామ నాయకులతో ఆయన సమావేశమయ్యారు. ఇటీవల వలేటి ఉపేంద్ర చనిపోగా కుటుంబసభ్యులను ఏలూరి పరామర్శించారు. అనంతరం గ్రామంలో పర్యటించారు. ఆయన వెంట పార్టీ మండలాధ్యక్షుడు నాయుడు హనుమంతరావు, వీరగంధం ఆంజనేయులు, కరి వీరాంజనేయులు, బోడెంపూడి సుబ్బారావు, కెల్లంపల్లి వెంకటేశ్వర్లు, వలేటి బ్రహ్మయ్య, రమేష్, పవన్ గ్రామ నాయకులు పాల్గొన్నారు.

కూటమి విస్తృత ప్రచారం

టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యరి ఏలూరి గెలుపుకోసం నాయకులు, కార్యకర్తలు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. శుక్రవారం పర్చూరులో ఒకటోవార్డు, రెండోవార్డులో చేపట్టిన ఎన్నికల ప్రచారానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించింది. పెద్ద ఎత్తున మహిళలు, వృద్ధులు, యువకులు తరలి వచ్చి ఏలూరికి మద్దతుగా నిలిచి ప్రచారంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రజా కూటమి నాయకులు కొల్లా శివరాంప్రసాద్, కఠారి, సురేంద్రబాబు కోటగిరి ప్రసాద్, కొల్లా చౌదరి, కృష్ణంశెట్టి, జగదీష్, కూరపాటి జగన్, ఊటుకూరి నిర్మల, కొల్లా సుబ్బాయమ్మ, శివాలశెట్టి రమ, నార్ని మణి, బేత భూపతి, జనసైనికులు అచ్చికోలు సతీష్, కొసనా యశ్వంత్ పాల్గొన్నారు. అదేవిధంగా రెండో వార్డులో చేపట్టిన ఎన్నికల ప్రచారంలో కొండ్రగంటి శివనాగేశ్వరరావు, రంగిశెట్టి ఆంజనేయులు, తులసి అప్పారావు, రంగిశెట్టి రవికుమార్, సాంబయ్య, శ్రీరాం వెంకట సుబ్బారావు, రంగిశెట్టి రామాంజనేయులు పాల్గొన్నారు.

టీడీపీకి పెరుగుతున్న మద్దతు

- పార్టీలో చేరుతున్న అన్నివర్గాల ప్రజలు
- ఆహ్వానం పలుకుతున్న కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి

అద్దంకి, మే 3 : అద్దంకి పట్టణంలో గతంలో ఎన్నడూ లేని విధంగా టీడీపీ కూటమి కి అన్ని వర్గాల ప్రజల మద్దతు పెరుగుతుంది. ఈ క్రమంలోనే అద్దంకి పట్టణంలో అన్ని సామాజిక వర్గాల్లోని వైసీపీ నేతలతో పాటు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు గొట్టిపాటి వెంట నడుస్తున్నారు. పలు వార్డులలో వైసీపీలో క్రియాశీలకంగా వ్యవహరించిన నేతలు టీడీపీలో చేరారు. దీంతో అత్యధిక శాతం వార్డులో వైసీపీ నాయకత్వ సమస్య కూడా తలెత్తింది. గతంలో టీడీపీని వీడి వైసీపీలో చేరిన నేతలతో పాటు వైసీపీ వెంటే నడిచిన పలువురు నేతలు, కార్యకర్తలు టీడీపీలో చేరారు. వైసీపీ ఎస్సీ సెల్ నేతగా ప్రత్యేక గుర్తింపు ఉన్న పూనూరి నరేంద్ర, కాపు సామాజిక వర్గం నుంచి అద్దంకి మున్సిపల్ 19వ వార్డు కౌన్సిలర్ యేజెండ్ల నాగరాజు, మాజీ డైరెక్టర్ యేజెండ్ల ఆంజనేయులు, శింగరకొండ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం చైర్మన్ నర్రావుల కొండలు, వైసీపీ బీసీ అధ్యయన కమిటీ మెంబర్ వినుకొండ వెంకటసుబ్బారావు, విశ్వబ్రాహ్మణ సంఘం నేతలు అద్దంకి అజయ్‌బాబు లు ఇప్పటికే టీడీపీ కండువా కప్పుకున్నారు. యాదవ సంఘం అధ్యక్షుడు తాటిబోయిన వెంకటేశ్వర్లు టీడీపీలో చేరారు. మున్సిపల్ సమావేశంలో సమస్యలపై గళమెత్తే ఆర్యవైశ్య సామాజికవర్గానికి 13వ వార్డు కౌన్సిలర్ విజయలక్ష్మి టీడీపీ కండువా కప్పుకున్నారు. వైసీపీ నేతలుగా ఉన్న దామా హనుమంతరావు, ఆ కుల కోటేశ్వరరావు తదితరులు టీడీపీలో చేరారు. పలువురు ముస్లిం యువకులు షేక్ మున్నీ, సైదా, రహమాన్, మదార్ తదితరులు గొట్టిపాటి రవికుమార్‌ను కలిసి టీడీపీలో చేరారు. టీడీపీకి మంచి పట్టు ఉన్న ఆర్య వైశ్య సామాజిక వర్గం నుంచి టీడీపీకి ఈ ఎన్నికలలో అనూహ్య మద్దతు లభిస్తోంది. నాయి బ్రాహ్మణ అద్దంకి పట్టణ అధ్యక్షుడు అద్దంకి హనుమంతరావు, అద్దంకి కొండలు లు టీడీపీ లో చేరారు. అద్దంకి పట్టణంలో టీడీపీ కూటమి అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్‌తో పాటు కుమారుడు హర్షవర్ధన్ నిర్వహిస్తున్న ఎన్నికల ప్రచారం లో అన్ని వర్గాల ఓటర్లు పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నారు. అద్దంకి పట్టణంలో ఆర్యవైశ్య సామాజిక వర్గంలో టీడీపీకి ఉన్న ఓటింగ్‌కు గొట్టిపాటి రవికుమార్‌తో స్వతహాగా ఉన్న ఓటర్లు తోడవడంతో టీడీపీకి ఎక్కువ ఓటింగ్ వచ్చే అవకాశం ఉందని టీడీపీ వర్గీయులు అంచనా వేస్తున్నారు. ఇలా అన్ని వర్గాల ఓటర్ల నుంచి టీడీపీకి మంచి స్పందన వస్తుండడంతో వచ్చే ఎన్నికలలో గతంలో కంటే భారీ మెజార్టీ వస్తుందని అంచనా వేస్తున్నారు. ఎన్నికల సమయానికి మరికొంత మంది కూడా టీడీపీలో చేరే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది.

టీడీపీలో చేరిన కొప్పెరపాడు ముస్లింలు


గొట్టిపాటి సమక్షంలో టీడీపీలో చేరిన కొప్పెరపాడు ముస్లింలు


12 వార్డులో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే గొట్టిపాటి

బల్లికురవ : మండలంలోని కొప్పెరపాడు ముస్లిం కాలనీకి చెందిన 15 కుటుంబాలు శుక్రవారం ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ సమక్షంలో వైసీపీని వీడి టీడీపీలో చేరారు. ఈసందర్భంగా పార్టీలో చేరిన వారికి రవికుమార్ పార్టీ కండువాలును వేసి వారికి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మే 13న జరిగే ఎన్నికలో సైకిల్ గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. పార్టీ అధికారంలోకి రాగానే అందరికీ అభివృద్ధి సంక్షేమ సకాలంలో అందేలా చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు షేక్ అబ్దుల్లా, నాగినేని సాంబశివరావు, తన్నీరు వెంకటేశ్వర్లు, ముసలయ్య, షేక్ మస్తాన్‌వలి, వరదయ్య, బలయ్య నాయక్, బుర్రి ప్రసాన్నాంజనేయులు పాల్గొన్నారు.

సూపర్‌సిక్స్ పథకాలతో అన్నివర్గాలకు లబ్ధి

బల్లికురవ : టీడీపీ సూపర్‌సిక్స్ పథకాలతో అన్నివర్గాల ప్రజలకు లబ్ధి చేకూరుతుందని యువనేత గొట్టిపాటి కమల్‌కిషోర్ (బాబీ) పేర్కొన్నారు. మండలంలోని మల్లాయపాలెం గ్రామంలో శుక్రవారం అద్దంకి ఉమ్మడి కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న గొట్టిపాటికి మద్దతుగా కమల్ కిషోర్ ఇంటింటికీ తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ పెట్టిన మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. 18 ఏళ్ల నుంచి 59 ఏళ్ల లోపు మహిళలందరికీ నెలకు రూ.1500, ఉచిత బస్సు, ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు ఏడాదికి రైతుకు రూ.20వేల పెట్టుబడి సాయం, బాలికల చదువుకు రూ.15వేలు అందజేస్తారన్నారు. పింఛన్‌ను రూ.4వేలకు పెంచారన్నారు. ఆనందకరమైన పాలన కోసం టీడీపీ కూటమికి ఓటు వేయాలన్నారు. ఎమ్మెల్యేగా గొట్టిపాటికి, ఎంపీగా కృష్ణప్రసాద్‌కు సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని బాబీ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వేల్పుల దానయ్య, నాగయ్య, హరి, అబ్బారెడ్డి బాలకృష్ణ, లేమాటి హనుమంతురావు, సారెద్దు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కూటమితోనే అభివృద్ధి, సంక్షేమం : ఎంపీ అభ్యర్థి కృష్ణప్రసాద్

పంగులూరు : టీడీపీ కూటమి ప్రభుత్వ ఏర్పాటుతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని కూటమి ఎంపీ అభ్యర్థి కృష్ణప్రసాద్ అన్నారు. మండలంలోని ముప్పవరం ఎస్సీ కాలనీలో శుక్రవారం స్థానిక నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించారు. అధికారంలోకి రాగానే వైసీపీ రద్దు చేసిన పథకాలను కొనసాగిస్తామన్నారు. 13వ తేదీన సైకిల్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా గొట్టిపాటిని, ఎంపీగా తనను గెలిపించాలని కృష్ణప్రసాద్ కోరారు. ప్రచార కార్యక్రమంలో నియోజకవర్గ ఎస్సీసెల్ అధ్యక్షుడు వరపర్ల సుబ్బారావు, కుక్కపల్లి ఏడుకొండలు, అల్లంనేని స్వామి, జగన్మోహనరావు, తెలగతోటి రాధాకృష్ణ, వెంకయ్యతో పాటు పలువురు నేతలు పాల్గొన్నారు.


కారుమంచిని అభినందిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి

టీడీపీ రాష్ట్ర కార్యదర్శిగా కారుమంచి

ఉత్తర్వులు జారీ చేసిన అచ్చెన్నాయుడు

పర్చూరు, మే 3 : తెలుగుదేశం రాష్ట్ర పార్టీ కార్యదర్శిగా పర్చూరు నియోజకవర్గానికి చెందిన కారుమంచి వెంకట కృష్ణారావును నియమిస్తూ ఆపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. ఈమేరకు రాష్ట్ర పార్టీ కార్యాలయం నుంచి కారుమంచికి ఉత్తర్వులు అందాయి. టీడీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన జయహో బీసీ కార్యక్రమం విజయవంతం చేయడంతోపాటు, పార్టీలో క్రియాశీలకంగా ఉంటూ అభ్యున్నతికి కారుమంచి కృషి చేస్తున్నారు. దీంతో ఎమ్మెల్యే ఏలూరి సిఫార్సుతో రాష్ట్ర పార్టీలో చోటుదక్కింది. తనకు సముచిత స్థానం కల్పించిన పార్టీ అధ్యక్షుడు అచ్చెన్నకు, ఎమ్మెల్యే ఏలూరికి కారుమంచి కృతజ్ఞతలు తెలిపారు.

బాబు సీఎం అయితేనే యువతకు భవిత

టీడీపీ కూటమి అభ్యర్థి కొండయ్య

చీరాల, మే 3 : చంద్రబాబు తిరిగి ముఖ్యమంత్రి అయితేనే యువతకు భవిష్యత్ అని టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎం కొండయ్య అన్నారు. మండల పరిధిలోని గవినివారిపాలెంకు చెందిన పలువురు శుక్రవారం టీడీపీ కార్యాలయంలో కొండయ్యకు కలసి మద్దతు తెలిపారు. కొండయ్య కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు కొండయ్య గెలుపునకు తమ వంతు కృషి చేస్తామన్నారు. ఎన్నికల వేళ అనుసరించాల్సిన విధివిధానాలను కొండయ్య వారికి వివరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అన్ని సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించుకుందామన్నారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ ప్రెసిడెంట్ పెర్ల సాంబశివరావు, మల్లవరపు పెద్ద అంకన్న, నక్కల సుబ్రమణ్యం, వాకా కృష్ణ, పాండు, ఇసాకు, శివాజీ, దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం మున్సిపల్ పరిధిలో 5,6,11 వార్డులలో జరిగిన ఇంటింటి ఎన్నికల ప్రచారంలో నాయకులు, కార్యకర్తలతో కలసి కొండయ్య పాల్గొన్నారు. మేనిఫెస్టోలోని అంశాలను వివరిస్తూ సైకిల్ గుర్తుకు ఓటేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


పార్టీలోకి ఆహ్వానిస్తున్న కొండయ్య


17వ వార్డులో ప్రచారం చేస్తున్న గౌరీఅమర్‌నాథ్

నాన్నకు ఓటేయండి

ఎన్నికల ప్రచారంలో టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కొండయ్య కుమారుడు గౌరీఅమర్‌నాథ్, కుమార్తె శివనారాయణదేవి శుక్రవారం విస్తృతంగా పర్యటించారు. పట్టణంలోని 17వ వార్డులో గౌరీఅమర్‌నాథ్, 15వ వార్డులో శివనారాయణదేవి సైకిల్ గుర్తుపై ఓట్లు వేయాలని కోరుతూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మేనిఫెస్టోలోని అంశాలను వివరించారు. కార్యక్రమాల్లో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీసీలంతా ఏకం కావాలి కొండయ్యను గెలిపించాలి

పార్టీలకు అతీతంగా బీసీలందరూ ఏకమై, కొండయ్యను గెలిపించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు పిలుపునిచ్చారు. టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత నెల 14వ తేదీ గుంటూరులో జరిగిన బీసీ సంక్షేమ సంఘం సమావేశంలో కూటమికి మద్దతు తెలపాలని సంఘం నిర్ణయించిందన్నారు. అందుకు అనుగుణంగా తాము కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేస్తామని చెప్పారు. కొండయ్య మాట్లాడుతూ వైసీపీ నేతలు చీరాలకు కల్పించిన ప్రతికూల పరిస్థితులను వివరించారు. తాను అందరివాడినన్నారు. కులాలకు, మతాలకు అతీతంగా తన అడుగులు ఉంటాయని నియోజకవర్గ ప్రజలు గుర్తించి స్వాగతిస్తున్నారన్నారు. సమావేశంలో పలువురు బీసీ సంక్షేమ సంఘం బాధ్యులు పాల్గొన్నారు.


ప్రచారం నిర్వహిస్తున్న శివనారాయణదేవి


మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న న్యాయాధికారి

వేసవిలో ఆరోగ్యంపై జాగ్రత్తలు పాటించాలి

చీరాలటౌన్, మే 3 : వేసవి ప్రభావం నుంచి ప్రజలు ఆరోగ్యంపై జాగ్రత్తలు పాటించాలని సీనియర్ సివిల్ న్యాయాధికారి సుధ అన్నారు. శుక్రవారం కోర్టు ప్రాంగణంలో చీరాల న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని న్యాయాధికారి ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో ఆరోగ్యకరమైన ఆహారాన్ని తినాలన్నారు. కక్షిదారులు అసౌకర్యం చెందకుండా చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ న్యాయాధికారి రెహానా, అడిషనల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి నిషాద్ నాజ్, న్యాయవాదులు రమేష్‌బాబు, ఉదయ్ భాస్కర్, రామ కోటేశ్వరరావు, పాల్గొన్నారు.

ఉత్సాహంగా కూటమి నాయకులు ప్రచారం

చినగంజాం, మే 3 : పలు గ్రామాల్లో టీడీపీ కూటమి నాయకులు ఉత్సాహంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. చినగంజాం, సోపిరాల, రాజుబంగారుపాలెం, సంతరావూరు తదితర గ్రామాల్లో టీడీపీ కూటమి అసెంబ్లీ, పార్లమెంట్ అభ్యర్థులు ఏలూరి సాంబశివరావు, కృష్ణప్రసాద్‌లకు సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరుతూ కూటమి నాయకులు శుక్రవారం ప్రచారం చేశారు. నమూనా ఈవీఎం ప్యాడ్స్ ద్వారా ప్రతి ఓటర్‌కు గుర్తు చూపిస్తూ ఓట్ల అభ్యర్థించారు. సూపర్‌సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు. మహాలక్ష్మి కాలనీకి చెందిన మాజీ వార్డు మెంబరు కాకాని వాసంతి సీనియర్ టీడీపీ నాయకురాలు ఎం.పద్మావతి సమక్షంలో టీడీపీలో చేరారు. వాసంతికి టీడీపీ కండవా కప్పి పద్మావతి పార్టీలోనికి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ కూటమి నాయకులు పాల్గొన్నారు.


సోపిరాల ప్రచారం చేస్తున్న కూటమి నాయకులు

కూటమి రాగానే ల్యాండ్ టైటిల్ చట్టం రద్దు

ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి

పంగులూరు, మే 3 : కూటమి ప్రభుత్వం ఏర్పాటు కాగానే ల్యాండ్ టైటిల్ చట్టాన్ని రద్దు చేస్తామని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ అన్నారు. మే 13న జరిగే ఎన్నికలో సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ గొట్టిపాటి రవికుమార్‌ను, కృష్ణప్రసాద్‌న ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మండలంలోని కొండమూరు గ్రామంలో శుక్రవారం రాత్రి సూపర్‌సిక్స్ పథకాల వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించారు. అనంతరం స్థానిక సమస్యలను తెలుసుకుంటూ ఇంటంటి ప్రచారం నిర్వహించారు.

ఈ సందర్భంగా గొట్టిపాటి మాట్లాడుతూ పేద, సాధారణ, మధ్య తరగతి రైతుల భూములు కబ్జా చేసేందుకే జగన్‌రెడ్డి ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని తెచ్చారన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి కాగానే ఆ చట్టాన్ని రద్దు చేస్తూ సంతకం చేస్తారన్నారు. భూములకు సంబంధించి ఇప్పటి వరకు కోర్టులకు ఉన్న అన్ని అధికారాలను తీసుకెళ్లి టైటిల్ రిజిస్ట్రేషన్ అధికారి (టీఆర్వో) చేతుల్లో పెట్టారని ఆందోళన వ్యక్తం చేశారు.


ప్రచారం నిర్వహిస్తున్న కూటమి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు గొట్టిపాటి, కృష్ణప్రసాద్

వృద్ధులు..దివ్యాంగులపై కనికరం లేని జగన్

సచివాయాలు, రెవెన్యూ సిబ్బంది ద్వారా ఇంటింటికీ వెళ్లి పింఛన్ పంపిణీ చేసే అవకాశం ఉన్నా రాజకీయ లబ్ధి కోసం జగన్‌రెడ్డి పన్నిన పన్నాగంలో వృద్ధులు, దివ్యాంగులు విలవిల్లాడుతున్నారని గొట్టిపాటి ఆవేదన వ్యక్తం చేశారు. గత నెల, ఈ నెల వృద్ధులు, దివ్యాంగులపై జగన్‌రెడ్డి కనికరం చూపలేదన్నారు. ఈనెల మొత్తం 55 లక్షల మందికిగాను 48 లక్షల మందికి బ్యాంక్ ఖాతాలకు నగదు బదిలీ చేశారన్నారు. పింఛన్‌లు పంపిణీ చేతగాని జగన్‌రెడ్డి దీనికి కారణం చంద్రబాబంటూ నిందలు వేస్తున్నారన్నారు. ప్రజలు నీ కుటిల బుద్ధిని గమనిస్తున్నారన్నారు. రాబోయేది కూటమి ప్రభుత్వమని, ఏప్రిల్ నుంచి రూ.4 వేల పింఛన్ అందిస్తామని గొట్టిపాటి తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే దళితుల అభ్యున్నతి

డాక్టర్ చార్వాక

పర్చూరు, మే 3 : దళితుల అభివృద్ధి.. సంక్షేమం చంద్రబాబుతోనే సాధ్యమని ఎస్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ చార్వాక అన్నారు. శుక్రవారం స్థానిక అంబేద్కర్ భవనంలో దళితుల సమావేశం జరిగింది. ఈసందర్భంగా చార్వాక మాట్లాడుతూ గడిచిన వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రంలో దళితులపై దాడులు, హత్యలు, అత్యాచారాలు జరిగాయన్నారు. దళిత ఓట్లుతో అధికారం చేపట్టిన జగన్‌రెడ్డి దళితుల అభివృద్ధిని విస్మరించారని మండిపడ్డారు. తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో దళితుల కోసం ఏర్పాటు చేసిన 27 పథకాలను జగన్ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించిన దళిత డాక్టర్‌ను త్రీవంగా హింసించి ఆయన మరణానికి కారకులయ్యారన్నారు. ఇలాంటి సంఘటనలు రాష్ట్రంలో అనేక చోటుచేసుకున్నాయన్నారు. పర్చూరు అభివృద్ధి ప్రదాత ఏలూరి సాంబశివరావును అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో దళిత పాస్టర్ల ఫెలోషిప్ అధ్యక్షుడు జోగి ప్రసంగి, నాయకులు నలిగిల కిషోర్ బాబు, ఒడ్డిముక్కల అబ్రహం, ఖమ్మం మార్కు, కోరిశపాటి ఇజ్రాయేలు, ఎలీషాబాబు, కట్ట సుజన్ రావు, రామపూడి అనిల్, నూతలపాటి ఇజ్రాయేల్, జూపూడి మార్కు, బిల్లా ఇసాక్, కట్ట చిన్న వందనం, రేగుల గడ్డ సింగ్రయ్య డేటా జయరాజు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డాక్టర్ చార్వాక

గ్రామాల్లో పోలీస్ పెట్రోలింగ్

మార్టూరు, మే 3 : ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించారు. ద్రోణాదుల, కోలలపూడి, బొల్లాపల్లి గ్రామాలలో పోలీసులు మార్చ్‌ఫాస్ట్, పెట్రోలింగ్ పికెటింగ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాలలోని ప్రధాన కూడలిలో మార్టూరు స్టేషన్ హౌస్ ఆఫీసర్ రాజశేఖర్‌రెడ్డి గ్రామస్థులతో మాట్లాడారు. ఎన్నికలు సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రజలు సహకరించాలన్నారు. గొడవలను ప్రోత్సహించే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాలలో ఎప్పటికప్పుడు పరిస్థితులపై పోలీసు నిఘా ఉంటుందన్నారు. అందరూ సహకరిస్తే ఎన్నికలు ప్రశాంతంగా జరుగుతాయన్నారు.

నిరుపేద కుటుంబానికి టీడీపీ సాయం

బల్లికురవ, మే 3 : మండలంలోని ఎస్సీ కాలనీకి చెందిన టీడీపీ కార్యకర్త మురికిపూడి ఆనందరావు అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. విషయం తెలిసిన వెంటనే గ్రామ టీడీపీ నాయకులు పరుసు ప్రేమప్రసాద్‌బాబు ఆ కుటుంబాన్ని పరామర్శించి వారికి తన వంతుగా ఆర్థిక సాయాన్ని అందజేశారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే నిరుపేద టీడీపీ కార్యకర్త కుటుంబాన్ని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ సహకారంతో ఆదుకుంటామని అయన వారి కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు.

ఐవైఎస్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ

అద్దంకిటౌన్, మే 3 : వేసవి కాలం ప్రజలకు తమ వంతుగా మజ్జిగను పంపిణీ చేసి సేవ చేస్తోంది ఐవైఎస్ ఫౌండేషన్. అద్దంకిలోని దర్శి రోడ్డులో గత పది రోజులుగా ఫౌండేషన్ సభ్యులు వేసవిలో ప్రజల ఇబ్బంది పడుతున్నారని వారి దాహార్తిని తీర్చడానికి ప్రతి రోజు దాతల సహకారంతో 500 మందికి మజ్జిగను పంపిణీ చేస్తున్నారు. వాహనదారులు అధికంగా తిరిగే ఈ దారిలో వాహనదారులు వాహనాలు ఆపి మరి వేసవికి మజ్జిగను తాగి వెళ్తున్నారు. ఈ సందర్భంగా ఐ వైఎస్ రక్షక్ ఫౌండేషన్ ఫౌండర్ షేక్ ఖాసింవలి మాట్లాడుతూ గత పది రోజులుగా దాతల సహకారంతో ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి రోజు 500 మందికి మజ్జిగను పంపిణీ చేస్తున్నామన్నారు. దాతలు ముందుకు వస్తే మరింత మందికి మజ్జిగను పంపిణీ చేసేందుకు మా ఫౌండేషన్ సభ్యులందరం సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

ఘర్షణలకు పాల్పడితే చర్యలు

బల్లికురవ, మే 3 : ఎన్నికలలో ఘర్షణలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని సంతమాగులూరు సర్కిల్ సీఐ నరసింహారావు హెచ్చరించారు. మండలంలోని వేమవరం, ఉప్పుమాగులూరు, సోమవరప్పాడు, కొప్పెరపాలెం, కోటవారిపాలెం గ్రామాలలో శుక్రవారం కేంద్ర బలగాలతో ప్రత్యేక పోలీసు కవాతు నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామ ప్రజలతో సీఐ మాట్లాడుతూ ప్రజలు ఎవరైనా పోలింగ్ రోజున ప్రశాంతంగా ఓట్లు వేసుకోవాలన్నారు. ఎవరైనా నిబంధనల మేరకు నడుచుకోకుండా అల్లర్లకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. అలానే ఓటర్లకు నగదు పంపిణీ, మద్యం పంపిణీ చేసినా చర్యలు తప్పవన్నారు. గ్రామాలలో ప్రజల కదలికలపై నిఘా ఉంచామని ఎన్నికల ముగిసే వరకు ప్రతిరోజూ గ్రామాలలో పోలీసుల పర్యటన ఉంటుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్ఐ బాలకృష్ణ పాల్గొన్నారు.

స్వేచ్ఛగా ఓటు వేయండి

ఇంకొల్లు, మే 3 : ప్రజలు ఓటు హక్కును స్వేచ్ఛాయుత వాతావరణంలో వినియోగించుకోవాలని సీఐ బత్తుల శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని గంగవరంలో శుక్రవారం రాత్రి కేంద్రబలగాలతో కవాతు నిర్వహించారు. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు పగడ్బందీగా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కవాతులో పోలీసు సిబ్బందితో పాటు కేంద్రబలగాలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థి ఇంటింటి ప్రచారం

పర్చూరు, మే 3: కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నల్లగొర్ల శివర శ్రీలక్ష్మీ జ్యోతి పర్చూరు నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఇంటింటికీ తిరిగి కాంగ్రెస్ పార్టీని బలపరచాలంటూ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో పార్టీ శ్రేణులతో కలసి ఆమె ప్రచార కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు పోతిన సంతపత్ కుమార్, రామరాజు యాదవ్, కాంగ్రెస్ పార్టీ అభిమానులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లో రాగి వైరు చోరీ

మార్టూరు, మే 3 : మండలంలోని రాజుగారిపాలెం పొలాల్లో గుర్తుతెలియని వ్యక్తులు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులగొట్టి అందులోని రాగి వైరును దొంగిలించారు. కళ్లేపల్లి హనుమంతరాజుతో పాటు మరో ఇద్దరు రైతులు ఏర్పాటు చేసుకున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి రాగి వైరును దొంగిలించారు. అంతేగాకుండా పగులగొట్టిన ట్రాన్స్‌ఫార్మర్ రేకులను అక్కడే వదిలి వేసి వెళ్లారు. గత నాలుగు రోజుల కిందట కూడా నాగరాజుపల్లిలో గుర్తుతెలియని వ్యక్తులు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులగొట్టి వైరును ఎత్తుకు పోయారు. అయితే దొంగిలించిన వైరు కన్నా ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు చేసుకోవడానికి మూడింతలు డబ్బులు ఖర్చు అవుతాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.